లీకేజీ నీళ్లే ఆధారం

- చుక్క చుక్క ఒడిసిపడితేనే తాగేందుకు నీరు
- బిందెడు నీటికోసం పడరాని పాట్లు
- పట్టించుకోని అధికారులు
- తునికినూతల తండా గిరిజనుల వెతలు

7



- పచ్చజెండా ఊపిన కేంద్రం
- విశాఖ-విజయవాడ-సూర్యాపేట-శంషాబాద్ మార్గంలో హైస్పీడ్ రైల్వే కారిడార్
- డోర్నకల్-సూర్యాపేట-గద్వాల లైన్‌కు మోక్షం
- ఘట్‌కేసర్-రాయగిరి ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు పనులకు నిధుల కేటాయింపు



సూర్యాపేటకు రెండు రైల్వేలైన్లు

ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతిపాదించిన పలు కొత్త లైన్లకు, డబ్లింగ్‌లైన్లకు, స్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది. బడ్జెట్ అనంతరం విడుదల చేసే పింక్‌బుక్‌లో ఈమేరకు ఆయా పనుల వివరాలను వెల్లడించింది. సూర్యాపేట కేంద్రంగా రెండు లైన్లను నిర్మించేందుకు సర్వేలకు ఆదేశించగా, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న నల్లగొండ-మాచర్ల రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో చాలాకాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన రైల్వేలైన్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హర్షం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఇప్పటివరకు రైల్వేలైన్ సదుపాయం లేని సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా త్వరలో రెండు రైల్వేలైన్లు రానున్నాయి. విశాఖపట్నం-విజయవాడ-సూర్యాపేట-శంషాబాద్ మార్గంతో పాటు, విశాఖపట్నం-విజయవాడ-కర్నూల్ వరకు హైస్పీడ్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్ సర్వే పూర్తయింది. కాగా, ఈ బడ్జెట్‌లో ఈమార్గంలో ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించడంతో పాటు అందుకు రూ.4.71 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచే హైస్పీడ్ రైళ్లు ఇటుగా ప్రయాణిస్తాయి. ఈ మార్గంతో పాటు కీలకమైన గద్వాల-డోర్నకల్ వయా సూర్యాపేట రైల్వేలైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో అనుమతించారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలోని డోర్నకల్ జంక్షన్ నుంచి హైదరాబాద్-బెంగుళూరు మార్గంలోని గద్వాల జంక్షన్ వరకు సుమారు 296 కిలోమీటర్ల మేర ఈ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ లైన్‌తో ఇప్పటివరకు రైల్వేలైన్ లేనటువంటి పట్టణాలకు రైల్వే మార్గం అందుబాటులోకి రానుంది. ఈ లైన్‌ను తొలి ప్రాధాన్యంలో చేపట్టే ఉద్దేశ్యంతో రైల్వేశాఖ బడ్జెట్‌లో ఫైనల్ లొకేషన్ సర్వేకు రూ.7.40కోట్లు కేటాయించింది. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి, పాలేరు మీదుగా సూర్యాపేట జిల్లాలోని మోతె, సూర్యాపేట మీదుగా నల్లగొండ-దేవరకొండ-నాగర్‌కర్నూల్-వనపర్తి-గద్వాల వరకు ఈ మార్గాన్ని ప్రతిపాదించారు. ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యాక ఈ మార్గంలో మార్పులు, చేర్పులతో చివరి రూట్ ఖరారవుతుంది.

కీలకమైన రైల్వేలైన్లు రెండింటినీ సూర్యాపేట కేంద్రంగా ప్రతిపాదించడంతో పాటు, ఈ రెండులైన్లను తొలి ప్రాధాన్యంలో చేపట్టేందుకు కేంద్రం సుముఖంగా ఉండడంతో వచ్చే బడ్జెట్‌లో నిధులిస్తారని భావిస్తున్నారు. ఈ లైన్లతో పాటు ఏళ్ల క్రితం సర్వే నిర్వహించిన నల్లగొండ-హాలియా-నాగార్జునసాగర్-మాచర్ల రైల్వేలైన్ నిర్మాణానికి కూడా కేంద్రం సుముఖంగా ఉంది. ఈ లైన్ సేఫ్టీ పనుల కోసం రూ.20లక్షలు కేటాయించడం ద్వారా ప్రభుత్వ ఆమోదంలో ఉందనే సంకేతాన్ని ఇచ్చినట్లయింది.

డబ్లింగ్ లైన్లు, ఇతర పనులకు నిధులు

గుంటూరు-బీబీనగర్ మార్గంలో రైల్వే డబ్లింగ్

- మిగతా 7వ పేజీలో...

ఘట్‌కేసర్-రాయగిరి ఎంఎంటీఎస్ విస్తరణకు ఆమోదం

యాదగిరిగుట్ట ఆలయానికి హైదరాబాద్ నుంచి రైల్వే సదుపాయం మెరుగుపరిచేందుకు వీలుగా ఘట్‌కేసర్-రాయగిరి మార్గంలో ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలనే ప్రతిపాదనలకు రైల్వేశాఖ అంగీకరించింది. అంతేగాక ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ కింద దీన్ని ప్రతిపాదించి, అందుకు రూ.110కోట్ల నిధులు కేటాయించింది.

బీబీనగర్-భువనగిరి నడుమ మూడోలైన్ ఏర్పాటు, ఫైనల్ లొకేషన్ సర్వేకు రూ.30కోట్లు కేటాయించింది. ఘట్‌కేసర్-బీబీనగర్ వరకు మూడు, నాలుగు లేన్ల ఏర్పాటుకు ఫైనల్ లొకేషన్ సర్వేకు రూ.29లక్షలు ప్రతిపాదించారు. అమృత్ భారత్ కింద యాదాద్రి స్టేషన్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, 4కిలోమీటర్ల మేర బైపాస్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు ఫైనల్ లొకేషన్ సర్వే చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

'ఉపాధి' కింద పండ్ల తోటల పెంపకం

మూడేళ్ల పాటు ప్రభుత్వ సాయం

సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు



నల్లగొండ, నార్కట్‌పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్ష లోపు ఎకరాల్లో మాత్రమే బత్తాయి, నిమ్మతో పాటు ఇతర తోటల విస్తీర్ణం ఉంది. జిల్లాలో ఉన్న పరిస్థితులతో చాలా చోట్ల రైతులు పండ్ల తోటల పెంపకంపై నిరాసక్తత చూపుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం కింద మూడేళ్లపాటు సహాయం అందజేసి పండ్ల తోటలను విస్తరింపజేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలుచేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు

వ్యవసాయ భూములు ఐదు ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలతో పాటు సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం వర్తించనుంది. భూసారం, స్వభావాన్ని బట్టి ఏ పండ్ల రకం సాగు చేయాలో రైతులే నిర్ణయించుకునేలా సుమారు 10 రకాలైన పండ్ల తోటలను జాబితాలో చేర్చారు. ఆసక్తి కనబరిచే రైతులకు మూడేళ్ల పాటు మొక్కల నిర్వహణ చార్జీలు చెల్లించనున్నారు. బత్తాయి, నిమ్మ, మామిడి, తైవాన్ జామ, సీతాఫల్, డ్రాగన్ ఫ్రూట్,మునగ, సపోట, కొబ్బరిబ్లాక్ ప్లాంటేషన్, కొబ్బరి బండ్ ప్లాంటేషన్‌లు వంటి పది రకాల పండ్ల తోటలు ఉన్నాయి.వీటిలో ఒక్క డ్రాగన్ ఫ్రూట్ తోటల పెంపకానికి మాత్రం అర ఎకరానికే మంజూరు ఇవ్వనుండగా మిగతా పంటలన్నింటికీ ఎకరం వరకు పెంపకానికి వీలు కల్పించారు. ఒక్క మునగ తోటకు మొదటి ఏడాది మాత్రమే రూ.36,000 చెల్లించనున్నారు. మిగతా పండ్ల తోటల్లోని బత్తాయికి ఎకరానికి వరుసగా మూడేళ్లకు కలిపి రూ.45,108, నిమ్మకు రూ.49,620, మామిడికి రూ.31,575, తైవాన్ జామకు రూ.1,08,000, సీతాఫల్‌కు రూ.6,015, డ్రాగన్ ఫ్రూట్‌కు (అర ఎకరం) 1,08,000, సపోటాకు రూ.27,048, కొబ్బరి బ్లాక్ ప్లాంటేషన్‌కు రూ.31,575, కొబ్బరి బండ్ ప్లాంటేషన్‌కు రూ.18,042 చెల్లించనున్నారు.

ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి



ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు ఐదు ఎకరాల లోపు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు అర్హుడే. మూడేళ్లపాటు పండ్ల తోటల రకాన్ని బట్టి ఉపాధిహామీ పథకం కింద చెల్లింపులు చేస్తాం. మొత్తం 10 రకాల పండ్ల తోటలకు సహాయం అందిస్తాం. అర్హులైన ప్రతీ రైతు దరఖాస్తు చేసుకొని పండ్ల తోటలను సాగు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వై.శేఖర్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి అధికారి

విధుల్లో చేరినా వేతనాలు లేవు

- 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్ల ఆవేదన
- వేతనాల కోసం ఎదురుచూపులు
- కుటుంబపోషణ భారమవుతోందని ఆందోళన

8

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 3,641మంది విద్యార్థులకు 3,400మంది హాజరయ్యారు. 241మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,248 మందికి, 3,045 మంది హాజరు కాగా, 203మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 393మందికి, 355మంది హాజరు కాగా, 38మంది గైర్హాజరయ్యారు. సెకండ్ ఇయర్‌లో మొత్తం 1073మందికి, 983మంది హాజరుకాగా, 90మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1035మందికి, 950మంది హాజరు కాగా, 85 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 38మందికి, 33మంది హాజరు కాగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, వాటిని సీజన్ పూర్తయ్యే వరకు జాగ్రత్త ఉంచుకోవాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని ఎరువుల దుకాణాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లైసెన్స్ డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రశీదులు తప్పనిసరిగా విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, ఖరీదు ఎంత అనేది తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేంద్రంపై ఒవైసీ అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. వ్యాఖ్యలకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నేతలు, హిందూ సంఘాల మనోభావాలు దెబ్బతినేలా ఓవైసీ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. పేద ముస్లింలకు ప్రయోజనకరంగా ఉండేందుకే వక్ఫ్‌బోర్డును కేంద్ర ప్రభుత్వం సవరణ చేస్తుందన్నారు. కొందరు ముస్లిం నాయకులు ఈ విషయాన్ని ప్రజలకు చేరనీయకుండా అపోహలు సృష్టించడం సరికాదన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు వారి స్వార్థం కోసం ముస్లింల సమాజాన్ని తమ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై కలెక్టర్లు నిర్ణయం తీసుకునే విధంగా సవరణలు ఉన్నాయన్నారు. దీంతో పేద ముస్లింలకు సమన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఓవైసీ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి 15గంటల పాటు నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు పోలీసులు తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ పోలీసులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గతంలో జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ దిష్టిబొమ్మ లను దహనం చేస్తే పోలీసులు కనీసం కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. కోమటిరెడ్డి అనుచరులు భూములను ఆక్రమించుకొని వెంచర్లు చేసిన విషయమై విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ పిల్లి రామరాజుయాదవ్, ఫకీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ము త్యాలరావు, మండల వెంకన్న, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, దిండు భాస్కర్‌గౌడ్, గుల్లపల్లి శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అక్రమాలు సహించం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చేయూత పథకంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, మే 22(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. చేయూత పథకంపై గురువారం మిర్యాలగూడ కళాభారతిలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న పింఛన్ల వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు.

అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితమైనవారు, వివిధ కారణాలతో బయోమెట్రిక్ పడని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శులు బయోమెట్రిక్ ద్వారా పింఛన్లు చెల్లించాలన్నారు. ఇతరుల పింఛన్లను పీఎస్‌ల బయోమెట్రిక్ ద్వారా డ్రా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధాప్యంతో చనిపోయినవారి పేర్లను ఒకటి రెండు సార్లు పరిశీలించి తొలగించాలన్నారు. జిల్లాలో సుమారు 29 వేల పింఛన్లు శాశ్వతంగా వలసవెళ్లినవారి జాబితాలో ఉన్నాయని, వాటన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చనిపోయిన, వలసవెళ్లిన వారి పేర్లు తొలగించడం, చనిపోయినవారి స్థానంలో వారి భార్య, లేదా భర్తకు పింఛన్ ఇవ్వడంతో తర్వాత ఆ సంఖ్య రెండు వేలకు చేరిందన్నారు. వర్షాలు కురిసే అవకాశమున్నందున పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వనమహోత్సవ కింద మొక్కలు నాటేందుకు2025-26 సంవత్సరానికి కార్యచరణ ప్రణాళికల రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్, మి ర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, రాష్ట్ర సెర్ప్ కార్యాలయ సోషల్ సెక్యూరిటీ పింఛన్ల పంపిణీ సంచాలకు లు గోపాల్‌రావు, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్

అడవిదేవులపల్లి: మండలకేంద్రంలోని భవిత కేంద్రంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలోని విద్యార్థులతో ముచ్చటించారు. భవిత కేంద్రంలో సౌకార్యలపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యుల, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను, మందుల స్టాక్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంఈవో వరలక్ష్మీ, ఏవో సరిత, ఆర్ఐ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నంబాల కేశవరావుది బూటకపు ఎన్‌కౌంటర్



నల్లబ్యానర్‌తో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను ఒడిషాలో అరెస్ట్ చేసి తీసుకొచ్చి చంపారని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా బాధ్యుడు సీహెచ్ సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ ఆరోపించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్‌లో గురువారం నల్లబ్యానర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపిన 28 మందిలో ఆదివాసీ ప్రజలు, మావోయిస్టు పార్టీ సభ్యులు, నాయకులు ఉన్నారన్నారు. ఛతీస్‌ఘడ్ రాష్ట్రం అబూజ్‌మడ్ అడవుల్లో ఇప్పటికే ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను, మావోయిస్టు సానుభూతిపరులను అత్యంత క్రూరంగా చంపుతున్నారని ఆరోపించారు.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కేశవరావును నిరాయుధుడిగా పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని కట్టుకథలు అల్లుతున్నార న్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల బాధ్యులు గూడూరు జానకిరామ్‌రెడ్డి, కోమటిరెడ్డి అనంతరెడ్డి, గద్దపాటి సురేందర్, గోలి సైదులు అయితగోని జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి జిల్లాకు బాలల న్యాయ మండలి

త్వరలోనే విధులు ప్రారంభం ▸▸ జిల్లాలో 65 కేసులు

భువనగిరి టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన పిల్లల (18 సంవత్సరాల్లోపు బాల నేరస్తులు) కేసులను విచారించే బాలల న్యాయ మండలి (జేజేబీ-జువైనల్ జస్టిస్ బోర్డ్) యాదాద్రి జిల్లాకు మంజూరైంది. వాస్తవానికి గతంలోనే జేజేబీ మంజూరైనప్పటికీ భవనం కొరత తదితర కారణాలతో విధుల ప్రారంభం వాయిదా పడుతోంది. ఈ నేపథ్యంలో భువనగిరి పాత బస్టాండ్ సమీపంలోని మునిసిపల్ కాంప్లెక్స్‌లో ఈ న్యాయ మండలి ఏర్పాటుకు అధికారులు భవనాన్ని కేటాయించారు. కాంప్లెక్స్‌లోని ఐసీడీసీ భువనగిరి ప్రాజెక్టు సీడీపీవో కార్యాలయాన్ని ఎదురుగా ఉన్న మరో భవనంలోకి మార్చి ఖాళీ అవుతున్న సీడీపీవో కార్యాలయాన్ని జేజేబీకి కేటాయించారు. ఈ మేరకు అవసరమైన భవన మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. కోర్టు వేసవి సెలవుల అనంతరం జేజేబీ విధులు ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. జేజేబీ మంజూరుతో జిల్లాలోని చట్టంతో విభేదించిన పిల్లలు విచారణ, వాయిదాల నిమిత్తం నల్లగొండకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం జిల్లాలో 65 మంది పిల్లలు జేజేబీ విచారణ పరిధిలో ఉన్నారు.

జేజేబీ చైర్మన్‌గా ప్రథమ శ్రేణి న్యాయమూర్తి

మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జేజేబీ చైర్మగా, ప్రభుత్వం నియమించిన ఇద్దరు సామాజిక, పిల్లల హక్కుల కార్యకర్తలు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరిలో ఒకరు పురుష, మరొకరు మహిళ ఉంటారు. అయితే పునర్విభజన జిల్లాలకు న్యాయశాఖ జేజేబీ సభ్యుల ని యామకాలను పూర్తి చేయలేదు. దీంతో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా సభ్యులనే ఒక్కో విభజన జిల్లాకు ఇన్‌చార్జీలుగా కేటాయించడంతో ఉమ్మడి జిల్లా జేజేబీ సభ్యుడిగా ఉన్న డాక్టర్ జి.మోహన్‌రావు యాదాద్రి జిల్లా సభ్యుడిగా వ్యవహరించనున్నారు. విచారణను ఎదుర్కొనే పిల్లలు సొంత న్యాయవాదులను నియమించుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తారు. అయితే మేజర్స్‌తో కలిసి ఉన్న కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొనే పిల్లల కేసులను కూడా ప్రత్యేకంగా జేజేబీలోనే న్యాయ విచారణ చేస్తారు. ఆరోపణలు నిరూపిస్తే శిక్షకోసం అబ్జర్వేషన్ హోమ్స్‌కు తరలిస్తారు. అవసరమైన వారికి బెయిల్ కూడా మంజూరు చేస్తారు. పిల్లల పోక్సో కేసులను కూడా ఇక్కడే విచారిస్తారు.

పేటలో పట్టపగలే దొంగతనం

సూర్యాపేటక్రైం, మే 22, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఈఘటనలో సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు, 60తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉండే పెండ్ర రమేష్‌బాబు గురువారం ఉదయం 11గంటల సమయంలో పట్టణంలోని బ్యాంకులో పని నిమిత్తం తన భార్యతో కలిసి వెళ్లాడు. తర్వాత అరగంటకు రాజీవ్‌నగర్‌లోని మరో వీధిలో నివాసం ఉంటున్న రమేష్‌బాబు సోదరి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని వెంటనే రమేష్‌బాబుకు ఫోన్ ద్వారా తెలిపింది. వెంటనే ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పాటు ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. బీరువాను పరిశీలించగా అందులో భద్రపరిచిన సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గ్రహించారు. రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల జననం

వలిగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురంలో వనగంటి స్వామికి గొర్రెపిల్ల ఎనిమిది కాళ్లు, రెండు తలలతో వింత ఆకారంలో జన్మించింది. ఈ గొర్రెపిల్లను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తిని కనబరిచారు. పుట్టిన గొర్రెపిల్ల వెంటనే మృతి చెందింది. ఇది జన్యుపరమైన లోపంతో పుట్టిందని పశువైద్యకారులు తెలిపారు.

కాసుల కోసం కక్కుర్తి

● ప్రజారోగ్యంతో వైద్యుల చెలగాటం ● లేని రోగాలు అంటగడుతున్న కొందరు వైద్యులు

వైద్యో.. నారాయణ హరి. వైద్యులను దేవుళ్లతో సమానమని అంటూ ఉంటారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మ నిస్తారని సమాజంలో నానుడి. అలాంటి కొందరి వైద్యులు కాసులకు కక్కుర్తిపడి జిల్లాలో లేని రోగాలు అంటగడుతూ వైద్య వృత్తికే మచ్చతెస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు ఓ వృద్ధురాలికి కోదాడలో ఓ వైద్యుడు లేని రోగాన్ని అంటగట్టి, 10 రోజులు మంచానికి పరిమితం చేసిన ఉదంతాన్ని చెప్పవచ్చు. మరో రోగి విషయంలో బంధువులకు రోగంపై తప్పుడు సమాచారం ఇచ్చిన విషయం చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి-కోదాడటౌన్)



సూర్యాపేట జిల్లాలో కొందరు వైద్యులు ఏజెంట్ల ద్వారా, మరికొందరు బంధువుల పేరుతో రోగులకు వలవేసి, తప్పుడు రోగాలను అంటగడుతూ అందిన కాడికి గుంజుతున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. నిజమైన సేవలు అందించే వైద్యులు, రోగులకు జరుగుతున్న నకిలీ వైద్యంపై ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. దీర్ఘకాలంగా మంచి వైద్యం అందిస్తున్న కొందరు వైద్యులకు నేటికీ సరైన ఆదాయం లేదని, ఇటీవలే వైద్య రంగంలోకి వచ్చి, పెద్ద పెద్ద భవనాలు నిర్మించే వారికి ఆదాయం ఎక్కడ నుంచి వస్తుందో తెలియని తెలియడంలేదని ఓ సీనియర్ వైద్యుడు పేర్కొన్నారు. కరోనా అనంతరం ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరికి కలవరం మొదలైంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వైద్యులు చిన్నపాటి రోగానికి, టెస్టులు, స్కానింగ్, ఎక్స్‌రే పేరుతో దండుకుంటున్నారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి, ఛాతీ, ఎముకల, లంగ్స్‌నొప్పితో వెళితే, ఏకంగా నీకు వాల్స్ బ్లాక్ అయ్యాయి, ఖమ్మం వెళ్లాలని సూచిస్తున్నట్లు సమాచారం. వైద్యులు చెప్పింది నిజమని, రోగులు భయపడే పరిస్థితి నెలకొంటున్నది. అదేవిధంగా ఈ నెల 18న జిల్లాకేంద్రంలో తీసుకున్న వైద్యం వికటించి, గర్భిణి మృతి చెందిన ఘటన చెప్పవచ్చు. ఇప్పటికే జిల్లాలో నకిలీ వైద్యులు, వైద్యంపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నకిలీ వైద్యం చేస్తూ, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, కేసీట్లో రోగి తీసుకున్న వైద్యంపై వివరాలు పొందుపరచే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారులను రోగులు కోరుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతి పొందిన ఆసుపత్రులు 229 ఉన్నాయి. వాటిలో 37 డెంటల్, 150 డయాగ్నిస్టిక్ సెంటర్లు, 19 ఫిజియోథెరపి, తొమ్మిది ఎక్స్‌రే, 44 అల్ట్రాసౌండ్ సెంటర్లు ఉన్నాయి.

లేని రోగం అంటగట్టారు

సూర్యాపేట జిల్లా కోదాడలో ఓ వృద్ధురాలు ఛాతినొప్పితో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యుడు ఈసీజీ తీయించాడు. ఆమె గుండెలో వాల్స్ బ్లాక్ అయ్యాయని, ఖమ్మం వెళ్లమని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఇది నిజమేనని నమ్మిన వృద్ధురాలు భయంతో ఇంటికి వెళ్లి, మంచానికి పరిమితమైంది. 10 రోజులు ఇంటి నుంచి బయటకు రాకపోవటంతో ఇరుగుపొరుగు వారు ఏమైందని ఆరా తీయగా, విషయం వారి దృష్టికి తీసుకెళ్లింది. వారు వృద్ధురాలు కుమారిడికి సమాచారం ఇచ్చారు. అతను తెలిసిన కార్డియాలజిస్టు దగ్గరకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యుడు వాల్స్ బ్లాక్ కాలేదు. ఎవరు చెప్పింది అని మండిపడ్డారు. దీంతో లేనిరోగంతో 10 రోజులుగా నరకయాతన పడిన వృద్ధురాలు ప్రస్తుతం కుదుటపడింది.

గుండె పనిచేయటంలేదని..

మరో యువకుడు ఛాతినొప్పితో కోదాడలోని ఓ వైద్యుడి దగ్గరకు వెళ్లాడు. గుండె పని విధానం సరిగా లేదని, ఖమ్మం వెళ్లాలని బంధువులకు సదరు వైద్యుడు చెప్పారు. అనుమానం వచ్చిన బంధువులు ఖమ్మం వెళ్లకుండా, వారికి తెలిసిన వైద్యుడికి విషయం చెప్పారు. పరీక్షించిన వైద్యుడు ఏమి లేదని, గుండె సరిగానే పనిచేస్తుందని చెప్పటంతో అవాక్కయ్యారు.

వివరణ కోసం ప్రయత్నించగా..

పై విషయమై వివరాలు తెలుసుకునేందుకు సూర్యాపేట డీఎంహెచ్‌వోకు ఫోన్ చేయగా, అందుబాటులోకి రాలేదు.

కాసుల కోసం పనిచేసే వైద్యులపై చర్యలు తీసుకోవాలి

చదువుకున్న, చదువులేని వారు అనారోగ్యానికి గురికాగానే, వైద్యులను సంప్రదించటం సాధారణం. వ్యాధి తొందరగా నయంకావాలనే ఆశపడుతుంటారు. దానిని ఆసరాగా తీసుకొని కొందరు వైద్యులు కాసులకోసం అవసరం ఉన్నా, లేకున్నా పరీక్షలు చేయించటం, మరింత కమీషన్ కోసం మెరుగైన చికిత్స పేరుతో ఖమ్మం, హైదరాబాద్ పంపిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు వైద్యులు ఏజెంట్ల సహాయంతో రోగులను రప్పించుకొని లేనిపోని రోగాలను అంటగడుతూ డబ్బే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితి కోదాడకు పరిమితంకాలేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి. కాసులకోసం కక్కుర్తి పడే వైద్యులను గుర్తించి, రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా, మానసిక క్షోభ, డబ్బు భారం పడకుండా, వెంటనే చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



బెదిరించిన కేసులో

నిందితులకు జరిమానా

నిడమనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): చంపుతామని ఓ వ్యక్తిని బెదిరించిన కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2017 సెప్టెంబరు 3న త్రిపురారం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన గందె సైదయ్య కుమారుడు మృతి చెందగా, అంత్యక్రియలు నిర్వహించే కార్యక్రమంలో ఉండగా అదే గ్రామానికి చెందిన కర్రె శ్రీనివాస్, కర్రె వీరమ్మ, కర్రె జ్యోతి, కర్రె శ్రావణి ఒక్కసారిగా సైదులు ఇంట్లోకి వచ్చి కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు సైదయ్య అదేరోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ ఎండీ ఆరిఫ్ నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా గురువారం కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుల నేరం రుజువుకావడంతో ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కొండమల్లేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలోని హైదరాబాద్‌రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు జరిమానాలు విధించడంతోపాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎన్వీ నారాయణ, వి.వాల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



ఘటనాస్థలంలో గాలంకి నీరజ్ మృతదేహం

కేతేపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో ఓ యువకుడు మృత్యు ఒడికి చేరిన ఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో గల మూసీ నదిలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కొండూరు మండలంలోని కౌలూరు గ్రామానికి చెందిన గాలంకి నీరజ్(21)తన సోదరుడి వరుసైన వెంకటరవీందర్‌రావుతో శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో బైక్ కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ శివారులోని మూసీ నది సమీపంలోకి రాగానే కాసేపు నదిలో ఈతకొట్టి వెళదామని, అక్కడి మూసీనదిపైగల పాత వంతెన కిందకు దిగారు. వెంకట రవీందర్‌రావు ఈత కొడుతుండగా ఈతరాని నీరజ్ నీళ్లలోకి దిగి స్నానం చేస్తుండగా పట్టుకోల్పోయిన నీరజ్ మూసీ నీటిలో మునిగిపోయాడు. ఈత కొడుతున్న వెంకట రవీందర్‌రావు నీరజ్‌ను కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో రవీందర్‌రావు నీరజ్ కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ నాయిని శ్రీనివాసులు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని నీళ్లలో మునిగిన నీరజ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకోసం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



కట్ట లక్ష్మి మృతదేహం

కట్టంగూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ముత్యాలమ్మగూడెంలో గురువారం జరిగింది. కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన కట్ట లక్ష్మి(35) తన ఇంటి ఆవరణంలో గల జీవైర్ దండెంపై ఉదయం దుస్తులు ఆరేస్తుండగా, విద్యుదాఘాతానికి గురైంది. ఇంట్లో ఉన్న ఆమె కుమార్తె చూసి చుట్టుపక్కల వారిని పిలిచింది. ఆమెను లేపే ప్రయత్నం చేయగా ఎంతకు లేవకపోవడంతో ఆటోలో నార్కెట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. లక్ష్మి భర్త కట్ట శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూగర్భజలాలను తోడేస్తున్నారు

● అక్రమ రిగ్గులతో ప్రభుత్వ ఆదాయానికి గండి



అక్రమంగా బోరు బావిని తవ్వకాలు చేస్తున్న వాహనం

భువనగిరి (కలెక్టరేట్), మే 22 (ఆంధ్రజ్యోతి): అవసరాలకు మించి నీటి వాడకం, అనుమతుల్లేకుండా బోరు బావులు తవ్వడం భవిష్యత్‌లో ప్రమాదాన్ని సూచిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాల్టా అమలు చేస్తున్నామని చెబుతూ, నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి ఎద్దడికి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అటు పాలకులు, ఇటు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా బోరు బావులను తవ్వేస్తూ వాల్టాను ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్‌లో నీటి కొరత తప్పదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వాల్టా విధి విధానాలు..

నీరు, భూమి, వృక్షాల సంరక్షణకోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002లో వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్(వాల్టా) గా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలో నీటి సంరక్షణ కొరకు బోరు బావుల తవ్వకాలు చేపట్టడానికి అనేక నిబంధనలున్నాయి. బోరు బావి తవ్వకంకోసం ఎవరైనా ముందస్తుగా రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ సిబ్బంది సర్వే నంబరు ఆధారంగా బోరు వేసే ప్రాంతాన్ని సందర్శించి దరఖాస్తును భూగర్భ జల వనరుల శాఖకు పంపుతారు. ఆ శాఖ టెక్నికల్ అధికారి సర్వే చేసి ఆ ప్రాంతంలో నీరు పడతాయని ధ్రువీకరిస్తే బోరు వేయడానికి అనుమతిస్తారు. ఒకవేళ బావిలో నీరు పడకపోతే బోరును పూర్తిగా పూడ్చి వేయాల్సి ఉంటుంది. గృహ అవసరాలకు వినియోగించే నీటి కొరకు వేసే బోరుకు సైతం ఇదే విధమైన అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత పకడ్బందీగా చట్టం ఉన్నా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. వ్యవసాయానికే కాకుండా గృహ అవసరాలకు అనుమతులు తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ ఎక్కడా పాటించడం లేదు. బోరు బావుల తవ్వకానికి ఎక్కువగా దరఖాస్తులు రావడం లేదని ఆ శాఖ అధికారులే పేర్కొనడం గమనార్హం.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో ఇష్టారీతిగా వేస్తున్న అక్రమ బోరు బావుల తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఒక్కో బోరు బావి తవ్వకానికి నిబంధన ప్రకారం రూ. 1000 భూగర్భ జలశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో 22 అనుమతి పొందిన రిగ్గులు ఉండగా, అనుమతి లేని రిగ్గులు ప్రతి నిత్యం జిల్లాలోని 17 మండలాలలో సుమారు 10 నుంచి 20 బోరు బావులను తవ్వుతున్నట్లు అనధికారికంగా తెలుస్తోంది. దీంతో 20 బోర్లకు 1000 చొప్పున నిత్యం 20 వేలు, నెలకు 6 లక్షలు ప్రభుత్వానికి గండి పడుతోంది. ఇది వేసవి కాలంలో అధికంగా ఉండే అవకాశం ఉంది.

అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి

టీజీ వాల్టా చట్టం ప్రకారం జిల్లాలో బోరు తవ్వకాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఇటీవల అదనపు కలెక్టర్ నేతృత్వంలో భూగర్భ జలాలు-వాల్టా జారీ చేసిన ఆదేశాలను అమలు చేస్తాం. జిల్లాలోని 112 పరిశ్రమలలో ఉన్న బోరు బావులకు, కొత్త పరిశ్రమల ఏర్పాటుకోసం తవ్వుతున్న బోరుబావులకు అనుమతులు మంజూరు చేశాం. వాణిజ్యపరంగా నీటిని వాడుకోవడానికి స్థానిక తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే భూగర్భ జల శాఖ తరఫున పరిశీలించి అనుమతి ఇస్తాం. అనధికారికంగా బోరుబావులు తవ్వుతున్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు.

వీ. స్వాతిశ్రీ, అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా

నల్లగొండ అదనపు ఎస్పీగా రమేష్

నల్లగొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్)గా గోళ్ల రమేష్ నియమితులయ్యారు. వెయింటింగ్ లిస్టులో ఉన్న ఈయనను రాష్ట్ర వ్యాప్త బదిలీలో భాగంగా జిల్లా ఏఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఇప్పటి వరకు జిల్లా అదనపు ఏఎస్పీగా పనిచేసిన రాములు నాయక్‌ను నిర్మల్ జిల్లా అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా బదిలీ చేశారు.

సూర్యాపేట అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి

సూర్యాపేటక్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు బదిలీ అయ్యారు. ఈమేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిన్నరకు పైగా జిల్లా అదనపు ఎస్పీగా పని చేస్తున్న నాగేశ్వర్‌రావును డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. సూర్యాపేటకు అదనపు ఎస్పీగా హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్‌లో పని చేస్తున్న యు. రవీందర్‌రెడ్డిని నియమించారు.

యాదగిరిగుట్ట ఏసీపీగా శ్రీనివాస్‌నాయుడు



యాదగిరిగుట్ట రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఏసీపీగా శ్రీనివాస్‌నాయుడును నియమిస్తూ గురువారం రాచకొండ సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన 2008 సంవత్సరం నుంచి 2010 వరకు యాదగిరిగుట్టలో ఎస్‌ఐగా విధులు నిర్వహించి పదోన్నతిపై మూడు నెలలుగా సీఐగా విధులు నిర్వహించారు. అంతకు ముందు ఏసీపీగా విధులు నిర్వహించిన రమేష్‌కు కుమార్ డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

ఆలేరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబం. కాయ కష్టం చేసుకుంటూ కన్న బిడ్డలను కడుపులో పెట్టుకొని పెంచి పెద్ద చేసింది. ఐదేళ్ల క్రితం భర్త, నేడు చేతికందిన కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఆలేరులో జరిగింది. ఆలేరులోని భరత్‌నగర్‌లో నివాసముంటున్న సోని, ఇబ్రహీం దంపతులకు కుమారుడు యూసుఫ్, కుమార్తె మహబూబీ ఉన్నారు. కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యూసుఫ్ (17) స్థానిక బీరప్ప ఆలయం వద్ద ఉంటున్న తన పెద్దమ్మ ఇంటి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు స్థానికులు తెలపడంతో వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే ఐదేళ్ల క్రితం తండ్రి ఇబ్రహీం ఆత్మహత్యకు పాల్పడగా, మూడు నెలల క్రితం అప్పుసప్పు చేసి తన కుమార్తె మహబూబీ వివాహం చేసింది. చేతికందిన ఆత్మహత్య చేసుకోవడంతో పేదింట విషాదం నెలకొంది. యూసుఫ్ గతంలో చికెన్ సెంటర్‌లో పనిచేయగా, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. వ్యసనాలే చావుకు కారణం అని తెలియవస్తుంది. ఈ విషయమై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నార్కట్‌పల్లి మండలంలో..

నార్కట్‌పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి, ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌటబావి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చౌటబావి గ్రామానికి చెందిన యానాల వెంకట్‌రెడ్డి (37) చిట్యాల మండలంలోని ఐడియల్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి గుట్టపైకి బైక్‌పై వెళ్లాడు. తనవెంట తీసుకువెళ్లిన పురుగుల మందు తాగాడు. కాగా తన బావమరిదికి ఫోన్‌చేసి తాను పురుగులమందు తాగిన విషయాన్ని చెప్పాడు. దీంతో అతను 100 కాల్ ద్వారా నార్కట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటుండగా అప్పటికే విషయం తెలిసిన గ్రామస్థులు అక్కడకు చేరుకుని వెంకట్‌రెడ్డి ఉన్న ఆచూకీ తెలుసుకుని వాహనంలో అతడిని స్థానిక కామినేని ఆసుపత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించి అప్పటికే వెంకట్‌రెడ్డి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే వెంకట్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రమాద సమయంలో బీ(ధీ)మా



'వేసవిలో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంటుంది. షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు.. సిలిండర్ పేలి మృత్యువాత.. ఇలా తరుచూ వార్తలు కనిపిస్తూనే ఉంటాయి. కారణం ఏదైనా వేసవి కాలం వచ్చిందంటే చాలు.. అగ్ని కీలలతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరుగుతుంటుంది. ఆస్తులతోపాటు.. కలలూ కాలిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అనుకోని ప్రమాదం జరిగినా.. ఆర్థికంగా భారం పడకుండా ఉండాలంటే ఫైర్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మంచిది. ఈ విషయంలో చాలామందికి కొన్ని సందేహాలు, అపోహలు ఉంటాయి. వాటినీ, అందులో ఉన్న వాస్తవాలేంటో తెలుసుకుందాం. అగ్ని ప్రమాదం జరిగినా.. నష్టపోకుండా ఉండడం ఎలా అనే అంశంపై కథనం.'

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

వ్యాపార సంస్థలకు అగ్ని ప్రమాదం వల్ల నష్టం జరిగితే ఇచ్చేది ఫైర్ ఇన్సూరెన్స్. మంటలు వ్యాపించడం వల్ల ఆస్తులు, వస్తువులకు జరిగిన నష్టాన్ని ఇది భర్తీ చేస్తుంది. పాలసీ తీసుకునే ముందు ఎంత విలువైన పాలసీని తీసుకుంటారో అంతమేరకు పరిహారం లభిస్తుంది.

వ్యాపార సంస్థలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపార సంస్థ అగ్ని ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగినా అది వ్యాప్తి చెందకుండా చూసేందుకు అన్ని పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఎంత అప్రమత్తంగా ఉన్నా అనుకోకుండా చిన్న నిప్పురవ్వతో అగ్ని కీలలు చెలరేగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అగ్ని ప్రమాదం జరగడానికి ప్రాథమికంగా విద్యుత్ వైర్లే కారణమవుతుంటాయి. ప్రతీ కంపెనీ, వ్యాపార సంస్థ, దుకాణంలో ఇవి సర్వసాధారణం. కాబట్టి వ్యాపార సంస్థ పరిమాణంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ బీమా తీసుకోవడం మంచిది. ఫ్యాక్టరీ యజమానులకు సరుకు అంతా కాలిపోతే వ్యాపారం నడవడం కష్టం. కొన్నిసార్లు ప్రమాదంలో కార్మికులు కూడా మరణించవచ్చు. ఇలాంటప్పుడు వారి కుటుంబానికి పరిహారాన్ని ఈ బీమా అందిస్తుంది. వ్యాపారాన్ని బట్టి, అగ్ని ప్రమాద బీమాను తీసుకునే వెసలుబాటు ఉంటుంది. అగ్ని ప్రమాద బీమాను తీసుకునే వెసలుబాటు ఉంటుంది. అగ్నిప్రమాద బీమా లేకపోతే మరమ్మతు ఖర్చులన్నీ సొంతంగానే భరించాల్సి వస్తుంది. వ్యాపార సంస్థ దగ్గర తగినంత నిర్వహణ మూలధనం లేకపోతే వ్యాపారాన్ని కొనసాగించడం చాలా కష్టం.


ప్రీమియం భారంగా భావించకూడదు

చాలామంది వ్యాపార సంస్థల యజమానులు అగ్ని ప్రమాద బీమాకోసం చెల్లించే ప్రీమియం చాలా అధికంగా ఉంటుందని భావిస్తుంటారు. ప్రీమియం తగ్గించుకునే లక్ష్యంతో వారి ఆస్తుల విలువ ఉన్నట్లు నమోదు చేస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాటిల్లిన నష్టానికి పూర్తి పరిహారం అందదు. అలాంటప్పుడు పాలసీ ఉన్నా.. దానివల్ల వచ్చే ప్రయోజనం అంతంత మాత్రమే. బీమా తీసుకునేటప్పుడు మీ ఆస్తి విలువకు సరిసమానంగా పాలసీ ఉండేలా చూసుకోవాలి. తక్కువ పాలసీని కొనుగోలు చేయడం వల్ల అది ఉన్నా.. లేనట్టే అవుతుంది. అందుకే ఆస్తికి తగిన బీమా తీసుకోవాలి.

ఇవన్నీ చూశాకే ... బీమా తీసుకోవాలి

- అగ్ని ప్రమాద బీమా పాలసీ తీసుకున్న తర్వాత దాన్ని కాలానుగుణంగా సమీక్షించుకోవాలి. వ్యాపార పరిమాణం పెరగడం, ఆస్తుల విలువ అధికం కావడం తదితర వాటిని చూసుకుని, దానికి తగినట్లుగా బీమా ఉందా ? లేదా ? చూసుకోవాలి.
- పాలసీ పత్రంలో చిరునామా సరిగా ఉందా ? లేదా ? చూసుకోవాలి.
- ఒకే ప్రదేశంలో పలు రకాల వస్తువులు, ఆస్తులు ఉన్నప్పుడు వాటన్నింటికీ కలిపి ఒకే పాలసీ ఉండేలా చూసుకోవాలి. ప్రతి దానికి విడివిడిగా తీసుకోవడం కంటే అన్నింటికీ కలిపి ఒకే పాలసీ తీసుకుంటేప్రీమియం తగ్గుతుంది.
- మీ సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులందరికీ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో వివరించాలి.
- ప్రమాద నివారణ పరికరాలను, ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తం చేసే అలారం తదితర వస్తువులను ఏర్పాటుచేసుకోవాలి.

పాలసీలను సద్వినియోగం చేసుకోవాలి



అగ్ని ప్రమాద బీమా పాలసీలు చాలా ఉన్నాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు వివిధ అగ్ని ప్రమాద బీమా పాలసీలు పొందవచ్చు. అయితే బీమా పాలసీలు తీసుకునేటప్పుడు బాగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. తమ ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రమాద బీమాకోసం దరఖాస్తు చేసుకునేవారు తమ ఆస్తికి తగిన బీమా పాలసీని ఎంచుకోవాలి. అప్పుడే బీమా వర్తిస్తుంది. ఈ పాలసీలు సద్వినియోగం చేసుకోవాలి.

గాడిపల్లి పరమేశ్వర్, ఎల్ఐసీ ఏజెంట్, భూదాన్‌పోచంపల్లి

అగ్నిప్రమాద బీమా ప్రాముఖ్యం

అగ్ని ప్రమాదాలవల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడానికి అగ్ని ప్రమాద బీమా (ఫైర్ ఇన్స్యూరెన్స్) సహాయపడుతుంది. వ్యాపారానికి ఈ బీమా చాలా అవసరం. ఒక దేశం పారిశ్రామిక అభివృద్ధికి, అగ్నిమాపక బీమా ఒక వ్యవస్థపకుడు, వ్యాపారవేత్త లేదా పరిశ్రమ యజమాని తీసుకున్న బీమా పాలసీకి నష్టాలకు ఆర్థికంగా చెల్లించే ఖచ్చితత్వాన్ని అందించడం ద్వారా కీలకపాత్ర పోసిస్తుంది.

వాణిజ్యం, వ్యాపారంలో పాత్ర

వ్యాపారం, వాణిజ్యాన్ని పెంచడానికి అగ్ని ప్రమాద బీమా ముఖ్యమైన నియమాలను రూపొందించింది. అగ్ని ప్రమాదం కారణంగా వ్యాపారవేత్త నష్టపోవచ్చు. ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి వ్యాపారవేత్త అగ్ని ప్రమాద బీమా చేయాలి. అగ్ని ప్రమాద బీమా ద్వారా అగ్ని ప్రమాదాల కారణంగా ఏదైనా నష్టాలు సంభవించిన తర్వాత డబ్బును వసూలు చేయడం ద్వారా తన వ్యాపారాన్ని కొనసాగించవచ్చు.

పరిశ్రమ రంగంలో పాత్ర



అగ్ని ప్రమాదం కారణంగా చిన్న లేదా పెద్ద పరిశ్రమలు పడిపోవచ్చు. ఈ రకమైన పరిశ్రమ బీమా సంస్థ నుంచి నష్టాన్ని తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాద బీమా ద్వారా రక్షణ పొందవచ్చు. పారిశ్రామిక రంగంలో కూడా అగ్ని బీమా ముఖ్యమైంది. అగ్ని ప్రమాదం కారణంగా ఏదైనా నష్టం జరిగితే బీమా సంస్థ నష్టాలను భరిస్తుంది.

రిస్క్ నివారణ పంపిణీ

బీమా సంస్థ అగ్ని ప్రమాద బీమాకోసం వివిధ వ్యాపారవేత్తల నుంచి అనేక బీమా ఒప్పందాలను తీసుకుంటుంది. కానీ, అగ్ని ప్రమాద సంస్థకు నష్టం కలిగించే కొన్ని వాపారాలకు మాత్రమే వారు కొంత మొత్తం చెల్లించాలి. అగ్ని ప్రమాదం వల్ల కలిగే నష్టాలను బీమా కంపెనీ ఒప్పందంలో అందరికీ పంపిణీ చేస్తారు. రిస్క్ అందరికీ పంపిణీ చేయబడుతుంది.

జాతీయ వనరుల రక్షణ, పునర్నిర్మాణం

జాతీయ వనరుల రక్షణ, పునర్నిర్మాణంకోసం అగ్ని ప్రమాద బీమా ఒక ముఖ్యమైన నియమాన్ని తీసుకుంటుంది. అగ్ని ప్రమాదంతో దెబ్బతిన్న బీమా కంపెనీ నుంచి డబ్బు తీసుకోవడం ద్వారా పునరుద్ధరించవచ్చు లేదా పునర్నిర్మించవచ్చు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, మే 22 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేషి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 26,82,813 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

హనుమాన్ జయంతి వేడుకలు

ప్రధానాలయం, పాతగుట్ట ఆలయంలో ఏకకాలంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి జయంతి వేడుకలు విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. అష్టోత్తర శత మాన్యసూక్త పారాయణాలతో అభిషేకం చేపట్టారు. చందనం అద్ది లక్ష తమలపాకులతో (నాగవల్లీ) సహస్రనామార్చన చేసి మహా నివేదన జరిపారు. అలాగే స్వామివారి ప్రధానాలయంలో ఆంజనేయ స్వామివారికి అంతరంగికంగా జయంతి వేడుకలు వైభవంగా చేపట్టారు. ప్రధానాలయ పుష్కరిణి చెంత జరిగిన పూజల్లో కలెక్టర్ ఎం. హనుమంతరావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, జూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు శంకర్‌నాయక్, మాచర్ల రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, నాగుల మహేష్, దీరావత్ రామరావునాయక్, భక్తులు పాల్గొన్నారు.



లక్ష తమలపాకుల పూజలు చేస్తున్న ప్రధాన పూజారి లక్ష్మీనరసింహచార్యులు

మట్టపల్లిలో వైభవంగా నృసింహుడి కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్యశాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణాన్ని వైభవంగా జరిపించారు .అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహా నివేధన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి చెన్నూరిమట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన సత్ర భవనం ప్రారంభమెప్పుడో ?

▶▶ యాదగిరిగుట్టలో నూతన భవనం ప్రారంభానికి కుదరని ముహూర్తం ▶▶ ఇంకా నేలపైనే భోజనాలతో భక్తుల ఇబ్బందులు ▶▶ ఇప్పటికే పలుమార్లు వాయిదా

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునఃప్రారంభించి మూడేళ్లు పూర్తయ్యింది. కానీ భక్తులకు అన్న ప్రసాదం అందించడానికి నిర్మించిన భవనం ఏడాది కాలంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, దాతకు సమయం కుదరక తరచూ వాయిదా పడుతోంది. దీంతో తాత్కాలికంగా కొనసాగిస్తున్న భవనంలో సదుపాయాలు లేక అన్న ప్రసాద సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి -యాదగిరిగుట్ట)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రానికి వచ్చిన భక్తు లకు ఇష్టదైవాల దర్శనాలతో పాటు పూర్వకాలం నుంచే ఇక్కడ అన్నప్రసాదం అందిస్తోన్నారు.అన్నప్రసాదం వడ్డించేందుకు విశాలమైన అత్యాధునిక వసతులతో ప్రజాప్రతినిధులకు దాత, దేవస్థానంలో ఆధ్వర్యంలో సుమారు రూ.20 కోట్లతో కొండకింద బస్టాం డ్ పక్కన నిర్మించారు. అయితే భవనం ప్రారంభించిక పోవడంతో అలంకార ప్రాయంగానే మిగిలింది. ప్రస్తుతం దీక్షపరుల భవనంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో నేలపైన కూర్చొని భోజనాలు చేయా ల్సి వస్తోంది. అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధంగా ఉన్న అన్నదాన సత్ర భవనం ఎప్పుడు ప్రారంభిస్తారోనని భక్తులు ఎదురుచూస్తుండగా అధికారులేమో తరచు వాయిదా వేస్తున్నారు. మంచినీటి నల్లాలు, ఫ్యాన్లు, కుర్చీలు, బెంచీలు లేక అసౌకర్యాల నడుమ భక్తులు భోజనాలు చేస్తున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అన్నదాన సత్ర భవనం

తరచూ వాయిదా

అన్నదాన సత్ర భవన ప్రారంభోత్సవం తరచూ వాయిదా పడుతూ వస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని ఆలయ అధికారులు యోచిస్తున్నారు. కాగా, 2025 ఫిబ్రవరి 23న స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక మహోత్సవాలు, మార్చి 1 నుంచి 11 వరకు జరిగిన వార్షిక బహ్మోత్సవాలు, ఏప్రిల్ 11న స్వామివారి జయంత్యుత్సవాలకు ప్రారంభించాలని దాతకు సమయం కుదరక తరచు వాయిదాలతో విసిగెత్తిపోతున్నారు. ఇప్పటికి మూడుమార్లు వాయిదా పడగా వేసవిలో కూడా అసౌకర్యాల నడుమ భక్తుల అగచాట్లు తప్పడం లేదు. వేడిమి, ఉక్కపోత, ఫ్యాన్లు, సరిపడా కుళాయిలు లేవు, నేలపైనే భోజనాలు చేయడంతో భక్తులు చిరాకు పడుతున్నారు. ప్రస్తుతం నిత్యం 2 నుంచి 5 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ సౌకర్యం ఉంది.



తాత్కాలిక తాత్కాలిక భవనంలో నేలపైనే భోజనాలు చేస్తున్న భక్తులు

రూ. 20 కోట్లతో ఆధునిక భవనం

కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో ఆరు ఎకరాల్లో సుమారు రూ.20 కోట్లతో ఆధునిక అన్నప్రసాద సత్ర భవనం సిద్ధం చేశారు. హరేరామ.. హరే క్రిష్ణ ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలతో సంప్రదింపుల మేరకు కొండ కింద వైటీడీఏ ప్రత్యేక ప్రణాళికలతో రూపొందించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం దాత వేగేశ్న అనంత కోటీరాజు విరాళం రూ.14 కోట్లు, పునాదులు, భవనం పనులకు వైటీడీఏ నిధులు, దేవస్థానం (గ్యాస్‌స్టౌవ్, పైపులైన్, బాయిలర్లు, ఇతర సామగ్రి) నిధుల భాగస్వామ్యంతో ఆదునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంట పరికరాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాల సేకరణతో భవన నిర్మాణం పూర్తి కాగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

1987లోనే అన్నదానం ప్రారంభం

యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలో పూర్వకాలం నుంచి భక్తులకు అన్నప్రసాద సదుపాయం కల్పిస్తున్నారు. దేవస్థానం నిధులతో రామానుజ కూటంలో పూజ విధులు నిర్వహించే అర్చకులు, బ్రాహ్మణ సత్ర ంలో స్వామిని దర్శించుకునే బ్రాహ్మణులు, ఇతర ప్రముఖులకు అన్నపానీయాలు సమకూర్చేవారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాలు, ఇతర విశేష వేడుకల్లో మాత్రం కొండపై గల శ్రీరామ్ భవన్‌లో భక్తులకు భోజన సదుపాయం కల్పించేవారు. కాలక్రమేణ భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడం అన్నప్రసాదానికి ఆదరణ కూడా అదే స్థాయిలో అధికమవడంతో 1987 సంవత్సరం నుంచి శాశ్వత అన్నదాన పథకానికి విరాళాల సేకరణ అప్పటి ఈవో బి.సుబ్బారావు చేపట్టారు. అప్పటి నుంచి రూ.516 నుంచి ఆపైన విరాళాలు అందజేసిన భక్తుల గోత్రనామాలపై అర్చనలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత కొండపై రోజుకు 200 మందితో ప్రారంభమైన ఈ పథకం 500, భక్తుల రద్దీ ఉండే ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాలు, విశేష రోజుల్లో వె య్యి నుంచి 1500 మందికి చేరింది. ప్రస్తుతం కొండకింద నూతన సత్ర భవనంలో రెండు వేల మందికి ఒకేసారి అన్నప్రసాదం అందించేందుకు వసతి ఉం ది. ఈ పథకంలో చేరిన వారికి జన్మదినం, వివాహ వార్షికోత్సవం వంటి శుభ కార్యక్రమాలకు వారి గోత్రనామార్చనలు నిర్వహించే విధంగా మార్పులు చేశారు.

అన్నదాన నిధి రూ. 25.37 కోట్లు

భక్తుల విరాళాలతో ప్రారంభించిన అన్నదాన పథకానికి ఇక్కడ విశేష ఆదరణ లభించింది. కొండపై స్వామివారి అన్నప్రసాదం స్వీకరించడమే కాక ఇతర భక్తులకు అన్న సదుపాయం కల్పించేందుకు భారీగా విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగానే అన్నదానం కోసం భక్తుల నుంచి (వార్షిక బ్రహ్మోత్సవాలు వరకు) వచ్చిన విరాళాలు రూ. 25.37 కోట్లు సమకూరాయి. ఈ నిధిని బ్యాంకులో డిపాజిట్ చేయగా వచ్చిన వడ్డీతో భక్తులకు అన్నప్రసాద వితరణ అందిస్తున్నారు.

ఇంకెప్పుడు ప్రారంభిస్తారు



ఆలయ పునఃప్రారంభం తర్వాత మూడేళ్లు దాటినప్పటికి అన్నదాన సత్రం ప్రారంభించలేదు. దాతలు, సీఎం సమయం కోసం వేచి చూస్తూ తరచు వాయిదాలు వేస్తూ భక్తులను కించపరుస్తున్నారు. సీఎం, దాతల కోస మే సత్ర భవనం నిర్మించినట్లు అధికారులు వ్యవహరిస్తూ భక్తుల అగచాట్లను పట్టించుకోవడం లేదు. వారు అవస్థలు అధికారులకు కనిపించడం లేదు. కావాల్సినంత త్వరలో నూతన భవనం ప్రారంభిస్తేనే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- కాదూరి అచ్చయ్య , స్థానిక భక్తుడు

త్వరలో వెల్లడిస్తాం



నిత్యాన్నదాన భవనం ప్రారంభానికి అంతా సిద్ధం చేశాం. అధికారులతో సమీక్ష నిర్వహించిన తర్వా ఎప్పుడు ప్రారంభించేది త్వరలో వెల్లడిస్తాం. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం. భవనం అందుబాటులోకి వస్తే నిత్యం రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేసే వీలుటుంది. భక్తులకు వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం.

ఎస్.వెంకట్రావు (దేవాదాయ శాఖ కమిషనర్, యాదగిరిగుట్ట, దేవస్థానం)

మూసీ గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్

కేతేపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ గరిష్ట నీటిమట్టానికి చేరువలోకి వస్తుండడంతో పాటు వర్షాకాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు గేట్ల నిర్వహణపై దృష్టి పెట్టింది డ్యాం యంత్రాంగం. వరదలు వచ్చిన సమయంలో గేట్లు ఎత్తడం, దించడం సులభంగా ఉండేందుకు ప్రాజెక్టు క్రస్టు, రెగ్యులేటరీ గేట్లకు ఏటా గ్రీసు, ఆయిల్ రాస్తుంటారు. ఈ ఏడాది సైతం గేట్ల నిర్వహణ చర్యలకై ప్రభుత్వం నుంచి రూ.6లక్షల వ్యయానికి అనుమతులు లభించడంతో ప్రాజెక్టు క్రస్టు, రెగ్యులేటరీ గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ పనులను గురువారం ప్రారంభించారు. మరో రెండుమూడు రోజుల పాటు ఈ పనులు కొనసాగనున్నాయి.



తగ్గిన పశు సంపద

మోత్కూరు, మే22 (ఆంధ్రజ్యోతి): 21వ పశుగణన ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పశుసంపద గణనీయంగా తగ్గింది. కోళ్ల పెంపకం మాత్రం పెరిగింది. గతంలో పశువులు లేనిది వ్యవసాయం సాగేదికాదు. పొలం, చెల్క దున్నకాలు, గొర్రు, చేలల్లో గుం టుక తోలడానికి, ఎడ్ల బండ్లపై రవాణాకు పశువులు అవసరముండేది. ఇప్పుడు వ్యవసాయ రంగంలో యాం త్రీకరణ పెరిగిపోవడంతో రైతు లు ప శువుల పెంపకాన్ని బాగా తగ్గించారు. గతంలో చిన్న రైతు అయితే ఒకట్రెండు అరకలకు, పెద్దరైతు అయినే మూడునాలుగు అరకలకు ఎడ్లో, దున్నపోతులో ఉండేవి. ఎక్కువ మంది రైతులకు ఎడ్ల బం డ్లు, పాడి పశువులు ఉండేవి. ఇప్పుడంతా ట్రాక్టర్లతో పనులు చేస్తున్నారు. దున్నకం, గొర్రు, గుంటుక తోలడం లాంటివి కూడా ట్రాక్టర్ల తోనే చేస్తున్నారు. కొందరు మాత్రమే పత్తి విత్తనాలు విత్తడానికి అచ్చులు తోలడం, పత్తి చేలల్లో గుంటుకలు తోలడం, వరి నాటుకు గొర్రు తోలడం పశువులతో చేస్తున్నారు. వ్యవసాయం, పశువుల పెం ఎకం శారీరక శ్రమతో కూడుకున్నది. పైగా వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదన్నది నగ్న సత్యం. దీంతో ప్రతి రైతు తనలా తన పిల్లలు కష్టపడకూడదని పిల్లలను చదివించి, చిన్నదో, పెద్దదో ఉద్యోగాలకు పంపుతున్నారు. వ్యవసాయంలో ఉంచడం లేదు. మానవుడికి అన్నం లేనిదే మనుగడ (జీవించ)లేకపోయినా వ్యవసా యం గిట్టుబాటు కాక ఓ వయస్సు రైతులు మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు తప్ప 80 శాతం యువత వ్యవసాయం వైపు చూడటం లేదు. పశువుల ధరలు లక్షల్లో ఉండటంతో పశువులను కొనే బదులు, ట్రాక్టర్ కొనుక్కోవడం మేలని భావిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకల పెంపకం పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

గత ఐదేళ్లలో ..

యాదాద్రి జిల్లాలో పశు సంపద, గొర్రెలు, మేకల పెంపకం గణనీయంగా తగ్గింది. 2019 పశుగణన ప్రకారం జిల్లాలో 1,08,117 ఎడ్లు, కోడెలు (తెల్లజాతి పశువులు), 1,68,657 దున్నపోతులు, పాడిగేదెలు (నల్లజాతి పశువులు), 7,25,326 గొర్రెలు, 1,59,105 మేకలు ఉండగా ఇప్పుడు (ఐదేళ్ల తర్వాత) 2024-25 పశుగణన ప్రకారం 67,144 తెల్లజాతి పశువులు, 1,07,444 నల్లజాతి పశువులు, 5,45,295 గొర్రెలు, 1,23,242 మేకలు ఉన్నాయి. జిల్లాలో కోళ్ల పెంపకం మాత్రం పెరిగింది. ఐదేళ్ల క్రితం 45,59,612 కోళ్లు ఉండగా ఇప్పుడు 1,23,45,261కి పెరిగింది.

యాదాద్రి జిల్లాలో మండలాల వారీగా జీవాల వివరాలు ఇలా..

మండలం	కుటుంబాలు		తెల్లజాతి పశువులు		నల్లజాతి పశువులు		గొర్రెలు		మేకలు		కోళ్లు	
	2019	2024	2019	2024	2019	2024	2019	2024	2019	2024	2019	2024
వలిగొండ	13,728	15,980	3,478	2,591	8,557	7,219	66,796	52,423	11,989	8,310	96,109	10,68,346
బొమ్మలరామారం	10,032	10,446	6,823	4,386	9,385	6,479	17,073	19,670	5,484	5,982	3,80,896	8,67,448
తుర్కపల్లి	9,143	10,085	12,589	3,696	14,989	4,673	62,246	23,485	15,785	7,289	1,14,022	4,18,534
రాజాపేట	12,178	12,113	9,422	7,710	6,286	4,489	29,706	20,724	5,834	7,143	3,15,238	4,92,563
యాదగిరిగుట్ట	11,786	13,216	12,190	8,368	10,050	5,861	46,123	24,591	9,078	6,547	1,42,165	3,92,794
ఆలేరు	10,838	12,859	8,617	6,299	9,333	3,969	28,764	13,782	5,857	3,614	44,519	1,27,556
గుండాల	8,174	9,443	4,492	3,963	10,144	5,595	63,124	48,289	12,044	8,307	1,47,422	3,39,436
మోత్కూరు	9,736	9,750	4,309	1,650	7,217	4,274	41,829	29,266	7,378	6,102	1,70,762	1,34,319
ఆత్మకూరు(ఎం)	8,076	8,402	4,877	2,454	9,017	4,994	49,423	34,479	8,594	6,026	80,836	3,44,816
భువనగిరి	30,902	26,901	12,424	4,768	21,188	11,693	54,589	30,694	18,282	9,060	1,81,398	26,90,439
బీబీనగర్	13,134	14,126	6,386	4,185	15,115	11,069	44,681	28,282	11,843	9,294	9,99,475	13,15,278
అడ్డగూడూరు	7,270	6,292	2,979	3,488	5,063	3,763	30,429	25,661	4,277	3,863	59,512	30,411
నారాయణపురం	11,506	12,622	4,412	2,468	3,671	2,252	26,415	20,150	7,372	5,568	2,59,965	3,04,616
మోటకొండూరు	5,880	7,456	6,439	4,697	3,899	4,125	22,021	27,405	4,234	3,139	15,921	17,100
రామన్నపేట	13,362	15,365	2,931	2,173	10,108	7,786	57,325	39,493	11,166	14,490	4,63,002	10,23,127
బి.పోచంపల్లి	12,376	13,741	2,734	1,949	13,617	11,197	47,716	74,088	12,298	9,415	6,77,480	10,10,247
చౌటుప్పల్	15,366	18,944	3,015	2,299	11,018	8,006	37,066	32,453	7,590	9,093	4,10,890	17,68,231
మొత్తం	2,03,487	2,18,361	1,08,117	67,144	1,68,657	1,07,444	7,25,326	5,45,295	1,59,105	1,23,242	45,59,612	1,23,45,261
		217,741						544,935				

సూర్యాపేటకు రెండు రైల్వేలైన్లు

(5వ పేజీ తరువాయి)

పనులకు రూ.2,853కోట్ల వ్యయమవుతుందని అంచనావేశారు. ఈ లైన్ ఫైనల్ లోకేషన్ సర్వే నిమిత్తం రూ.3.10కోట్లు, అదేవిధంగా విష్ణుపురం వద్ద బైపాస్ నిర్మాణానికి రూ.110కోట్ల నిధులు కేటాయించారు. బీబీనగర్-భువనగిరి మధ్య ఫైనల్ లోకేషన్ సర్వేకు రూ.30లక్షల నిధులు కేటాయించారు. మోటమర్రి-విష్ణుపురం మధ్య రైల్వేలైన్ డబ్లింగ్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. అదేవిధంగా విష్ణుపురం-జాన్‌పహాడ్ నడుమ 11కిలోమీటర్ల మేర కొత్తలైన్‌ను రూ.77.80 కోట్లతో నిర్మించేందుకు అంగీకరించడమే గాక, ఈ లైన్ సేఫ్టీ పనుల కోసం రూ.20లక్షలు కేటాయించింది. అదేవిధంగా జాన్‌పహాడ్-మేళ్లచెరువు మధ్య 27 కిలోమీటర్ల రైల్వే లైన్ ఆధునీకరణ పనులకు రూ.513.20కోట్ల నిధులు కేటాయించింది. మేళ్లచెరువు-జగ్గయ్యపేట నడుమ కొత్త లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపి, సేఫ్టీ ఫండ్స్ కింద రూ.5కోట్లు కేటాయించింది. మిర్యాలగూడ వద్ద గూడ్స్ షెడ్ ఆధునీకరణకు రూ.3.32కోట్ల నిధులు కేటాయించింది.

నల్లగొండ, మిర్యాలగూడ స్టేషన్లలో సదుపాయాలు

నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు నిమిత్తం ఒక్కో స్టేషన్‌కు రూ.1.30కోట్లు కేటాయించారు. అమృత్ భారత్ కింద స్టేషన్ల ఆధునీకరణకు ఒక్కో స్టేషన్‌కు రూ.5.70కోట్లు కేటాయించగా, పనులు సాగుతున్నాయి. నల్లగొండలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, రెండు ఎస్కలేటర్ల నిర్మాణానికి రూ.2.76 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. నల్లగొండ-తిప్పర్తి నడుమ, నల్లగొండ-శ్రీరాంనగర్ నడుమ బాక్స్ బ్రిడ్జిల పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

జిల్లా కోర్టు భవనాలకు టెండర్ టెక్నికల్ బిడ్ ఓపెన్

● సీవోటీ పరిశీలన అనంతరం బిడ్ ఓపెన్ చేయనున్న అధికారులు

భువనగిరి టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు భవనాలతో పాటు మరో 11 జిల్లాల కోర్టుల భవనాల నిర్మాణానికి రూ.672 కోట్ల అంచనా వ్యయంతో పిలిచిన వ్యవస్థీకృత టెండర్ టెక్నికల్ బిడ్‌ను అధికారులు ఈ నెల 19న తెరిచారు. ఒక్కొక్కటి రూ.81 కోట్ల వ్యయంతో 12 జిల్లాల్లో నిర్మించాల్సిన భవనాల పనులకు కేఎంవి ప్రాజెక్ట్సు, స్టార్ బిల్డర్స్ డెవలపర్స్ టెండర్లు వేసాయి.

దీంతో ఆ రెండు ఏజెన్సీ టెక్నికల్ బిడ్స్‌ను కమిటీ ఆఫ్ టెండర్స్ (సీవీటీ) పరిశీలించనుంది. అన్ని సక్రమంగా ఉంటే వారం, పది రోజులలో ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేసి నిబంధనల మేరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను అప్పగిస్తారు. అన్ని సజావుగా జరిగితే జూలైలో భువనగిరి శివారులోని మాసుకుంటలో కేటాయించిన 10 ఎకరాల స్థలంలో జిల్లా కోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే మిగతా 11 జిల్లాల్లో కూడా అదే సమయంలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పనులు పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

'ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి'

సూర్యాపేటఅర్బన్, ఆత్మకూర్(ఎస్), మే 22(ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ ఎన్ కౌంటర్‌లో పై సిట్టింగ్ జడ్జితో విచారణ న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎన్‌కౌంటర్‌కు నిరసన నిర్వహించి అనంతరం కొత్తబస్టాండ్ వద్ద ఆయన మాట్లాడారు. కేంద్రం అధికారంలో వచ్చిన తర్వాత ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే ప్రయత్నం చేస్తుందన్నారు.ప్రజల సమస్యలు పరిష్కరించ లేని ప్రభుత్వాలు ఉన్నంతకాలం నక్సలిజం అజేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లిరేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, ఒంటికొమ్ము సంతోషి, ఐత రాజుపద్మ, లింగయ్య, మల్లమ్మ, రేణుక, అనసూయ, ముత్తయ్య, యేసు పాల్గొన్నారు.

● మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావును బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చారని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ చేయించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి అల్లుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం లోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సక్క, ఉమేష్, కొరివి అంజయ్య, సాయిలు, చంద్రయ్య, నాగరాజు పాల్గొన్నారు.

లీకేజీ నీళ్లే దాహార్తి తీరేందుకు ఆధారం

● చుక్క చుక్క ఒడిసిపడితేనే తాగడానికి నీళ్లు ● బిందెడు నీళ్ల కోసం పడరాని పాట్లు ● పట్టించుకోని అధికారులు

మిషన్ భగీరథకు సంబంధించిన ఎయిర్ వాల్వ్ నుంచి చుక్క చుక్కగా జాలువారే లీకేజీ నీళ్లను బిందెల్లో ఒడిసిపట్టి తాగడానికి వినియోగిస్తున్నారు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం లోని తునికినూతల తండాకు చెందిన గిరిజనులు. కోట్లాది రూపాయలు వెచ్చించి అమలు చేస్తున్న భగీరథ పథకం క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడంలేదు. దాహార్తిని తీర్చుకోవడానికి ప్రజలు చేస్తున్న ఈ భగీరథ ప్రయత్నం దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది.

(ఆంధ్రజ్యోతి - తిరుమలగిరి(సాగర్)

భగీరథ నీటి పథకం ప్రారంభమైనప్పటి నుంచి తునికినూతల తండాలోని చర్చి వెనుకవైపు ఉన్న వీధిలో సుమారు 70 ఇళ్లకు నీరు సరఫరా కావడంలేదని గిరిజనులు తెలిపారు. ఈ క్రమంలో తమ దాహార్తిని తీర్చుకోవడానికి సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి బిందెల్లో నీటిని తెచ్చుకుని తాగడానికి, ఇంట్లో అవసరాలకు వినియోగించేవారు. అయితే వారి ఇళ్లకు సమీపంలో రోడ్డు పక్కన వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఎయిర్‌వాల్వ్ ఒకటి ఉంది. ఆ ఎయిర్ వాల్వ్ నుంచి భగీరథ నీళ్లు కొద్దికొద్దిగా లీకవుతున్నాయి. చుక్కలుచుక్కలుగా కిందికి జాలువారుతున్న ఆ లీకేజీ నీటినే ఒడిసిపట్టి బిందెల్లో స్థానిక గిరిజనులు నింపుకుని తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు.

ఒక్క బిందె నిండాలంటే క్యూలైన్‌లో ఉండాల్సిందే

తమ ఇళ్లకు భగీరథ నీరు సరఫరా కానందున సంబంధిత గిరిజనులతో పాటు తండాకు చెందిన మరికొందరు కూడా ఎయిర్‌వాల్వ్ ఉన్న ప్రాంతానికే వచ్చి లీకేజీ నీటిని తమ ఇళ్లకు తీసుకువెళుతున్నారు. చుక్కచుక్కగా కిందకు జాలువారే ఆ ఎయిర్ వాల్వ్ పాయింట్ వద్ద మహిళలు బిందెలతో క్యూలైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే భగీరథ నీటికి, బోరు నీటిని కలిసి సరఫరా చేస్తున్నారు. భగీరథ ట్యాంకులను సక్రమంగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయనందున ఆ నీటిని తాగేందుకు కొందరు స్థానికులు విముఖత చూపిస్తున్నారు. దీంతో తండాకు చివరన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు అను సంధానమైన ఎయిర్‌వాల్వ్ పాయింట్ నుంచి లీకేజీ అవుతున్న నీటిని తీసుకువెళ్లేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో చుక్కలు చుక్కలుగా కిందకు జాలువారుతున్న నీటిని ఒడిసి పట్టుకునేందుకు మహిళలు ప్రతిరోజు అర్ధరాత్రి 12గంటల వరకు, మళ్లీ ఉదయం తెల్లవారు జామున మూడు గంటల నుంచి ఇక్కడి వచ్చి తాగునీటిని బిందెల్లో నింపుకోవాల్సి వస్తోందని ఇక్కడి గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గంటల తరబడి వేచి ఉంటే ఒకే ఒక్క బిందెకు సరిపడా నీళ్లు మాత్రమే వస్తున్నాయని, ఆ నీళ్లనే తాము రోజంతా తాగడానికి వినియోగించుకుంటున్నామని మహిళలు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తునికినూతలతండాలో లీకవుతున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

చుక్కచుక్కగా వచ్చే నీళ్లనే బిందెల్లో నింపుకుంటున్నాం



మా ఇళ్లకు మిషన్ భగీరథ నీరు చాలా రోజుల నుంచి రావడంలేదు. అందుకే లీకేజీ అవుతూ చుక్క చుక్కగా వస్తున్న నీటినే బిందెల్లో నింపుకుంటున్నాం. ఒక బిందెను పట్టుకోవడానికి రేయింబవళ్లా నిరీక్షించాల్సి వస్తోంది

- వడ్త్యా చావ్లి,తునికినూతలతండా

మా ఇళ్లకు నీరు రావడం లేదు



భగీరథ పథకం ప్రారంభమైనప్పటి నుంచి మా ఇళ్లకు నీరు రానందున ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ పొలాల్లో బోరు నీటిని ఎయిర్ వాల్వ్ నుంచి లీకవుతున్న నీటిని బిందెల్లో నింపుకుంటున్నాం.

- కుర్ర బాబు, తునికినూతలతండా

అమర జవాన్‌కు నివాళి

పాకిస్తాన్‌తో మధ్య జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన భారత సైనికుడు ముడావత్ మురళినాయక్‌కు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. స్థానిక హైస్కూల్‌లో వృత్యంతర శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో మురళినాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ● ఆంధ్రజ్యోతి- మర్రిగూడ,




మర్రిగూడలో మురళినాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు











విధుల్లో చేరినా వేతనాలు లేవు

● 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్ల ఆవేదన ● వేతనాల కోసం ఎదురుచూపులు ● కుటుంబపోషణ భారమవుతోందని ఆవేదన



కనగల్ మండల కేంద్రంలోని మండల రిసోర్స్ కేంద్రం

కనగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నియమితులైన 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్లు విధుల్లో చేరినప్పటి నుంచీ వేతనాల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇంత వరకు వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని వారు వాపోతున్నారు. 17ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత వీరికి టీచర్ ఉద్యోగం సాకారమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాంట్రాక్ట్ బేసిక్‌పై నెలకు రూ.31,040 చొప్పున గౌరవ వేతనంతో ఫిబ్రవరిలో ఎస్‌జీ టీలుగా నియామక పత్రాలు తీసుకుని విధుల్లో చేరారు. కనగల్ మండలంలోని తుర్కపల్లి, పర్వతగిరి, పడిగిమర్రి, షైలారం, బచ్చన్నగూడెం, మరో గ్రామంలోని పాఠశాలలో వీరు పనిచేస్తున్నారు. అప్పటివరకు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడ్డ వీరు ఇక తమ కష్టాలు తీరాయని సంతోషపడ్డారు. ఉద్యోగంలో చేరామన్న ఆనందమే తప్ప నాలుగు నెలలుగా వేతనాలు అందక ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. అప్పులు చేసి నెట్టు కొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులకు కాంట్రాక్ట్ టీచర్లు హాజరు అవుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో ప్రయాణ చార్జీలు భారంగా మారాయం టున్నారు. వేతనాల చెల్లింపుపై ఉన్నతాధికారులు నుంచి ఎలాంటి స్పందన లేదని జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారంగా మారింది



జీతాలందక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. జిల్లాలో పనిచేస్తున్న కాం ట్రాక్ట్ టీచర్లందరిది ఇదే దుస్థితి. అధికారులు స్పందించి వేతన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

● నేతకాని విజయ్‌కుమార్, కాంట్రాక్ట్ టీచర్ తుర్కపల్లి, ఎంపీయూపీఎస్.

అనంతరామశర్మ ఆశయాలు సాధించాలి

నల్లగొండ రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పెన్నా అనంతరామశర్మ ఆశయాలు సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మ వీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని దొడ్డికొమరయ్య భవనం లో గురువారం అనంతర రామశర్మ మొదటి వర్ధంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరామశర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని, ఆయన నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండా శ్రీశైలం, సయ్యద్ హాషం, సీహెచ్ లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, గంజి మురళీధర్, సైదులు, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, ఖమ్మంపాటి శంకర్, ఆకారపు నరేష్, బిక్షం, కోట్ల అశోక్‌రెడ్డి, గాద నరసింహ, పి మధుసూదన్‌రెడ్డి, పాల్గొన్నారు.

కట్టంగూరు: సీపీఎం నాయకుడు పెన్నా అనంతరామశర్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా కట్టంగూరులో ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంజి మురళి, పెంజర్ల సైదులు, ఎన్న నర్సిరెడ్డి, గుడుకుంట్ల రామకృష్ణ, రవీందర్, పొడిచేటి సులోచన, లింగస్వామి, అంజయ్య, రామస్వామి, రాములు, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



పెన్నా అనంతర రామశర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

మర్రిగూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల విద్యాధికారి బిట్టు శ్రీను అన్నారు. మర్రిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిక్షణ పొందుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యులు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఉదావత్ లచ్చిరాం, ఐతరాజు నాగయ్య, రజనీకాంత్, శ్రీను, స్వప్న, స్వప్న, నాగేంద్ర, కరీం, సంఘాల నాయకులు ఎస్. శ్రీనివాస్‌రావు, అంజయ్య, అల్వాల్ రెడ్డి, విఠల్, వెంకట్‌కుమార్, శ్రీరామ్, వెంకట్ తదితరులు ఉన్నారు.



గన్నీబస్తాలకు డబ్బులు వసూలు?

● బస్తాకు రూ.2 వసూలు చేస్తున్నారని రైతుల ఆరోపణ ● నిబంధనలు పాటించని నిర్వాహకులు



మర్రిగూడలోని కొనుగోలు కేంద్రం వద్ద పట్టాలు కప్పిన ధాన్యం రాశులు

మర్రిగూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): తాము ఆరుగాలం పాటు శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే ఐకేపీ సిబ్బంది దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే సిబ్బంది నిబంధనలు పెట్టి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం మ్యాచూర్ వచ్చిన అనంతరం గన్నీ సంచుల్లో నింపాలి. గన్నీ బ్యాగులను రైతులకు ఉచితంగా అందజేయాలి కానీ ఐకేపీ సిబ్బంది ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఒక్క గన్నీ బ్యాగుకు రూ. రెండు చొప్పున వసూలు చేస్తున్నారని లేదంటే గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై వివరణ కోరగా సిబ్బంది రైతుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణపై విచారణ చేస్తామని ఐకేపీ ఏపీఎం వెంకట్ తెలిపారు. మళ్లీ ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూస్తామన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

150 గన్నీ బ్యాగులకు రూ.300 చెల్లించాను

నేను పండించిన వరి ధాన్యంను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. నాకు గన్నీ బ్యాగులు ఇస్తే ఒక్క గన్నీ బ్యాగుకు రెండు రూపాలయ చొప్పున, అదేవిధంగా హమాలీల కూలి కూడా చెల్లించాలని నా వద్ద రూ.1700లు వసూలు చేశారు. సిబ్బంది బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలి.

● రాజునాయక్, రైతు జంటతండా, మర్రిగూడ

ప్రభుత్వ స్థలంలో అధికారుల సర్వే

కనగల్. మే 21:(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలకంటిగూడెం గ్రామ శివారు సర్వే నెం1427లో గల ప్రభుత్వ భూమిని ఆర్డీవో అశోక్‌రెడ్డి సమక్షంలో గురువారం అధికారులు సర్వే చేశారు. గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న పేదలు తమకు పట్టాలు ఇవ్వాలని రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. స్థలాన్ని సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్‌లో అందుబాటులో ఉన్న స్థలం ఎంత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంత వినియోగిస్తున్నారో గుర్తించారు. సర్వే నివేదికను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో అశోక్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాది తాత్కాలికంగా జూనియర్ కళాశాలను విద్యా సంవత్సరం నిర్వహించేందుకు కనగల్ పోలీస్ క్వాటర్స్‌లోని గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, హౌసింగ్ డీఈ రాంనర్సింహ్మారెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, ఏఆర్‌ఐ యాదగిరి, మాజీ సర్పంచ్ బోగరి రాంబాబు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, నాగయ్య, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

న్యూస్ బాక్స్

'గురుకులాల ఎత్తివేత నిర్ణయం సరికాదు'

నల్లగొండ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ పరిధిలోని 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకులాలు ద్వారా పేద వర్గాలకు ప్రధానంగా అణగారిన విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలు లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో గురుకుల పాఠశాలలు విద్యార్థులకు ఆసరాగా ఉంటున్నాయని, ఉన్న విద్యాసంస్థలను అభివృద్ధి చేసి మరింత మందికి అడ్మిషన్లు ఇచ్చి చదువు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ పాస్ యంత్రాలు వినియోగించాలి



డీలర్లకు ఈపాస్ మిషన్లను అందజేస్తున్న ఏడీఏ జానిమియా

నార్కట్‌పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సేవలో అధునాతన ఈ పాస్ యంత్రాలను వినియోగించాలని నకిరేకల్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ మహ్మద్ జాని మియా అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, మునుగోడు మండలాలకు చెందిన ఎరువుల డీలర్లకు గురువారం అధునాతన ఈ పాస్ యంత్రాలు అందజేశారు. ఎరువులు, రసాయనాలు విక్రయించే సమయంలో డీలర్లు రైతుల ఆధార్‌తో లింక్ చేసిన ఈ పాస్ యంత్రంలో ఎప్పటికపుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు. దీనివల్ల కేంద్రం నిర్వహించే ఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఎరువుల నిల్వలపై పారదర్శకత వచ్చి రాష్ట్రానికి రావలసిన ఎరువులు సకాలంలో వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయాధికారులు గౌతమ్, గిరిప్రసాద్, పద్మజ, కోరమాండల్ కెంపెనీ సేల్స్ అధికారి సతీశ్ పాల్గొన్నారు.

బిల్లులపై ప్రకటన అవాస్తవం

నల్లగొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వ ప్రకటనలు అవాస్తవమని తెలంగాణ సర్పంచుల ఫోరం పేర్కొంది. తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సచివాలయంలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం గురువారం అందజేశారు. సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సర్పంచులు ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే రూ.153 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పడం సరికాదన్నారు. విడుదల చేసిన నిధులతో సర్పంచులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య ఉన్నారు.

జై వీర హనుమాన్‌కీ..



పాతబస్తీలోని ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సమీప హనుమాన్ దేవాలయాల చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంలో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాగం వర్షిత్‌రెడ్డి, లక్ష్మణరావు, రాజయ్య, చంద్రశేఖర్, బండారు ప్రసాద్, అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల గీత, జీవీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస్ గీత దంపతులు దాతలు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పసునూరి శ్రీనివాస్, దయాకర్, రమేశ్, రవీందర్, దోసపాటి విష్ణుమూర్తి, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు బత్తుల ఊశయ్య, మేడబోయిన శ్రీనివాస్, దుబ్బాక శ్రీధర్, మేకల రాజిరెడ్డి, దూదిమెట్ల స్రవంతి, జెరిపోతుల భరత్, బండారు రమేశ్ పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని భీమారం, కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భీమారంలో రథోత్సవం నిర్వహించారు. కొర్లపహాడ్‌లో నిర్వహించిన పూజల్లో టీపీసీసీ నాయకుడు ధైద రవీందర్, న్యాయవాది గుండ్లపల్లి నర్సింహ్మారావు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని నూలగడ్డ కొత్తపల్లి గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకటి లింగయ్య, శంకర్, సిరిపంగి పరమేష్, కట్టంగూరి సురేందర్‌రెడ్డి, నిమ్మల మధు, తోటకూరి పరశురామ్ పాల్గొన్నారు. శాలిగౌరారం, రామగిరి, పాపురాలగూడెం గ్రామాల్లోని ఆంజనేయస్వామి



కేతేపల్లిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



నార్కట్‌పల్లి: హోమంలో పాల్గొన్న భక్తులు

ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేష్ పూజలు చేశారు. శాలిగౌరారంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అంజనేయ విగ్రహ అలంకరణకు శాలిగౌరారం రిటైర్డ్ లెక్చరర్ గురిజాల వెంకటేశ్వర్లు శర్మ, రమాదేవి దంపతులు వెండి మకరతోరణం బహూకరించారు.

చిట్యాలరూరల్: పెద్దకాపర్తి, నేరడతో పాటుగా పలు గ్రామాల్లో హనుమాన్ జయంతిని వేడుకగా నిర్వహించారు. వెలిమినేడు శివారు ఆంజనేయస్వామి దేవాలయంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు. గర్భగుడిలో పురోహితులు లక్షమల్లికాపుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వేదమంత్రాలతో పూజలు చేశారు. భక్తులకు నల్లగొండకు చెందిన కాటమికార్ హైమావతి, ఆమె కురమారుడు, కోడలు సాయినాథ్, రచనల సౌజన్యంతో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్, పురోహితులు వల్లూరి లక్ష్మీనర్సింహమూర్తి, వల్లూరి నిఖిల్‌శర్మ, నన్నూరి మల్లారెడ్డి, మంకాల వేమన, అరూరి రమేష్, పోలగోని మంగమ్మ, అరూరి యాదమ్మ పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలోని అంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, కూరెల్ల శ్రీను, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, పొన్నం లక్ష్మయ్య, భానుక ఉదయ్ పాల్గొన్నారు.



లీకేజీ నీళ్లే ఆధారం

- చుక్క చుక్క ఒడిసిపడితేనే తాగేందుకు నీరు
- బిందెడు నీటికోసం పడరాని పాట్లు
- పట్టించుకోని అధికారులు
- తునికినూతల తండా గిరిజనుల వెతలు

7



- పచ్చజెండా ఊపిన కేంద్రం
- విశాఖ-విజయవాడ-సూర్యాపేట-శంషాబాద్ మార్గంలో హైస్పీడ్ రైల్వే కారిడార్
- డోర్నకల్-సూర్యాపేట-గద్వాల లైన్‌కు మోక్షం
- ఘట్‌కేసర్-రాయగిరి ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు పనులకు నిధుల కేటాయింపు



సూర్యాపేటకు రెండు రైల్వేలైన్లు

ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతిపాదించిన పలు కొత్త లైన్లకు, డబ్లింగ్‌లైన్లకు, స్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది. బడ్జెట్ అనంతరం విడుదల చేసే పింక్‌బుక్‌లో ఈమేరకు ఆయా పనుల వివరాలను వెల్లడించింది. సూర్యాపేట కేంద్రంగా రెండు లైన్లను నిర్మించేందుకు సర్వేలకు ఆదేశించగా, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న నల్లగొండ-మాచర్ల రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో చాలాకాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన రైల్వేలైన్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హర్షం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఇప్పటివరకు రైల్వేలైన్ సదుపాయం లేని సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా త్వరలో రెండు రైల్వేలైన్లు రానున్నాయి. విశాఖపట్నం-విజయవాడ-సూర్యాపేట-శంషాబాద్ మార్గంతో పాటు, విశాఖపట్నం-విజయవాడ-కర్నూల్ వరకు హైస్పీడ్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్ సర్వే పూర్తయింది. కాగా, ఈ బడ్జెట్‌లో ఈమార్గంలో ఫైనల్ లోకేషన్ సర్వేకు ఆదేశించడంతో పాటు అందుకు రూ.4.71 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచే హైస్పీడ్ రైళ్లు ఇటుగా ప్రయాణిస్తాయి. ఈ మార్గంతో పాటు కీలకమైన గద్వాల-డోర్నకల్ వయా సూర్యాపేట రైల్వేలైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో అనుమతించారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలోని డోర్నకల్ జంక్షన్ నుంచి హైదరాబాద్-బెంగుళూరు మార్గంలోని గద్వాల జంక్షన్ వరకు సుమారు 296 కిలోమీటర్ల మేర ఈ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ లైన్‌తో ఇప్పటివరకు రైల్వేలైన్ లేనటువంటి పట్టణాలకు రైల్వే మార్గం అందుబాటులోకి రానుంది. ఈ లైన్‌ను తొలి ప్రాధాన్యంలో చేపట్టే ఉద్దేశ్యంతో రైల్వేశాఖ బడ్జెట్‌లో ఫైనల్ లోకేషన్ సర్వేకు రూ.7.40కోట్లు కేటాయించింది. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి, పాలేరు మీదుగా సూర్యాపేట జిల్లాలోని మోతె, సూర్యాపేట మీదుగా నల్లగొండ-దేవరకొండ-నాగర్‌కర్నూల్-వనపర్తి-గద్వాల వరకు ఈ మార్గాన్ని ప్రతిపాదించారు. ఫైనల్ లోకేషన్ సర్వే పూర్తయ్యాక ఈ మార్గంలో మార్పులు, చేర్పులతో చివరి రూట్ ఖరారవుతుంది. కీలకమైన రైల్వేలైన్లు రెండింటినీ సూర్యాపేట కేంద్రంగా ప్రతిపాదించడంతో పాటు, ఈ రెండులైన్లను తొలి ప్రాధాన్యంలో చేపట్టేందుకు కేంద్రం సుముఖంగా ఉండడంతో వచ్చే బడ్జెట్‌లో నిధులిస్తారని భావిస్తున్నారు. ఈ లైన్లతో పాటు ఏళ్లక్రితం సర్వే నిర్వహించిన నల్లగొండ-హాలియా-నాగార్జునసాగర్-మాచర్ల రైల్వేలైన్ నిర్మాణానికి కూడా కేంద్రం సుముఖంగా ఉంది. ఈ లైన్ సేఫ్టీ పనుల కోసం రూ.20లక్షలు కేటాయించడం ద్వారా ప్రభుత్వ ఆమోదంలో ఉందనే సంకేతాన్ని ఇచ్చినట్లయింది.

డబ్లింగ్ లైన్లు, ఇతర పనులకు నిధులు

గుంటూరు-బీబీనగర్ మార్గంలో రైల్వే డబ్లింగ్

- మిగతా 7వ పేజీలో...

ఘట్‌కేసర్-రాయగిరి ఎంఎంటీఎస్ విస్తరణకు ఆమోదం

యాదగిరిగుట్ట ఆలయానికి హైదరాబాద్ నుంచి రైల్వే సదుపాయం మెరుగుపరిచేందుకు వీలుగా ఘట్‌కేసర్-రాయగిరి మార్గంలో ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలనే ప్రతిపాదనలకు రైల్వేశాఖ అంగీకరించింది. అంతేగాక ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ కింద దీన్ని ప్రతిపాదించి, అందుకు రూ.110కోట్ల నిధులు కేటాయించింది.

బీబీనగర్-భువనగిరి నడుమ మూడోలైన్ ఏర్పాటు, ఫైనల్ లోకేషన్ సర్వేకు రూ.30కోట్లు కేటాయించింది. ఘట్‌కేసర్-బీబీనగర్ వరకు మూడు, నాలుగు లేన్ల ఏర్పాటుకు ఫైనల్ లోకేషన్ సర్వేకు రూ.29లక్షలు ప్రతిపాదించారు. అమృత్ భారత్ కింద యాదాద్రి స్టేషన్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, 4కిలోమీటర్ల మేర బైపాస్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు ఫైనల్ లోకేషన్ సర్వే చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

'ఉపాధి' కింద పండ్ల తోటల పెంపకం

మూడేళ్ల పాటు ప్రభుత్వ సాయం

సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు



నల్లగొండ, నార్కట్‌పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పండ్ల తోటల విస్తీర్ణం గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్ష లోపు ఎకరాల్లో మాత్రమే బత్తాయి, నిమ్మతో పాటు ఇతర తోటల విస్తీర్ణం ఉంది. జిల్లాలో ఉన్న పరిస్థితులతో చాలా చోట్ల రైతులు పండ్ల తోటల పెంపకంపై నిరాసక్తత చూపుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం కింద మూడేళ్లపాటు సహాయం అందజేసి పండ్ల తోటలను విస్తరింపజేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలుచేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు

వ్యవసాయ భూములు ఐదు ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలతో పాటు సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం వర్తించనుంది. భూసారం, స్వభావాన్ని బట్టి ఏ పండ్ల రకం సాగు చేయాలో రైతులే నిర్ణయించుకునేలా సుమారు 10 రకాలైన పండ్ల తోటలను జాబితాలో చేర్చారు. ఆసక్తి కనబరిచే రైతులకు మూడేళ్ల పాటు మొక్కల నిర్వహణ చార్జీలు చెల్లించనున్నారు. బత్తాయి, నిమ్మ, మామిడి, తైవాన్ జామ, సీతాఫల్, డ్రాగన్ ఫ్రూట్,మునగ, సపోట, కొబ్బరిబ్లాక్ ప్లాంటేషన్, కొబ్బరి బండ్ ప్లాంటేషన్‌లు వంటి పది రకాల పండ్ల తోటలు ఉన్నాయి.వీటిలో ఒక్క డ్రాగన్ ఫ్రూట్ తోటల పెంపకానికి మాత్రం అర ఎకరానికే మంజూరు ఇవ్వనుండగా మిగతా పంటలన్నింటికీ ఎకరం వరకు పెంపకానికి వీలు కల్పించారు. ఒక్క మునగ తోటకు మొదటి ఏడాది మాత్రమే రూ.36,000 చెల్లించనున్నారు. మిగతా పండ్ల తోటల్లోని బత్తాయికి ఎకరానికి వరుసగా మూడేళ్లకు కలిపి రూ.45,108, నిమ్మకు రూ.49,620, మామిడికి రూ.31,575, తైవాన్ జామకు రూ.1,08,000, సీతాఫల్‌కు రూ.6,015, డ్రాగన్ ఫ్రూట్‌కు (అర ఎకరం) 1,08,000, సపోటాకు రూ.27,048, కొబ్బరి బ్లాక్ ప్లాంటేషన్‌కు రూ.31,575, కొబ్బరి బండ్ ప్లాంటేషన్‌కు రూ.18,042 చెల్లించనున్నారు.

ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి



ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు ఐదు ఎకరాల లోపు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు అర్హుడే. మూడేళ్లపాటు పండ్ల తోటల రకాన్ని బట్టి ఉపాధిహామీ పథకం కింద చెల్లింపులు చేస్తాం. మొత్తం 10 రకాల పండ్ల తోటలకు సహాయం అందిస్తాం. అర్హులైన ప్రతీ రైతు దరఖాస్తు చేసుకొని పండ్ల తోటలను సాగు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వై.శేఖర్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి అధికారి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 3,641మంది విద్యార్థులకు 3,400మంది హాజరయ్యారు. 241మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,248 మందికి, 3,045 మంది హాజరు కాగా, 203మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 393మందికి, 355మంది హాజరు కాగా, 38మంది గైర్హాజరయ్యారు. సెకండ్ ఇయర్‌లో మొత్తం 1073మందికి, 983మంది హాజరుకాగా, 90మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1035మందికి, 950మంది హాజరు కాగా, 85 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 38మందికి, 33మంది హాజరు కాగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, వాటిని సీజన్ పూర్తయ్యే వరకు జాగ్రత్త ఉంచుకోవాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని ఎరువుల దుకాణాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లైసెన్స్ డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రశీదులు తప్పనిసరిగా విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, ఖరీదు ఎంత అనేది తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో అక్రమాలు సహించం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చేయూత పథకంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, మే 22(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. చేయూత పథకంపై గురువారం మిర్యాలగూడ కళాభారతిలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న పింఛన్ల వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు.

అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితమైనవారు, వివిధ కారణాలతో బయోమెట్రిక్ పడని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శులు బయోమెట్రిక్ ద్వారా పింఛన్లు చెల్లించాలన్నారు. ఇతరుల పింఛన్లను వీఎస్‌ల బయోమెట్రిక్ ద్వారా డ్రా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధాప్యంతో చనిపోయినవారి పేర్లను ఒకటి రెండు సార్లు పరిశీలించి తొలగించాలన్నారు. జిల్లాలో సుమారు 29 వేల పింఛన్లు శాశ్వతంగా వలసవెళ్లినవారి జాబితాలో ఉన్నాయని, వాటన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చనిపోయిన, వలసవెళ్లిన వారి పేర్లు తొలగించడం, చనిపోయినవారి స్థానంలో వారి భార్య, లేదా భర్తకు పింఛన్ ఇవ్వడంతో తర్వాత ఆ సంఖ్య రెండు వేలకు చేరిందన్నారు. వర్షాలు కురిసే అవకాశమున్నందున పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వనమహోత్సవ కింద మొక్కలు నాటేందుకు2025-26 సంవత్సరానికి కార్యచరణ ప్రణాళికల రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్, మి ర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, రాష్ట్ర సెర్ప్ కార్యాలయ సోషల్ సెక్యూరిటీ పింఛన్ల పంపిణీ సంచాలకు లు గోపాల్‌రావు, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్

అడవిదేవులపల్లి: మండలకేంద్రంలోని భవిత కేంద్రంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలోని విద్యార్థులతో ముచ్చటించారు. భవిత కేంద్రంలో సౌకార్యలపై ఆరాతీశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యుల, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను, మందుల స్టాక్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంఈవో వరలక్ష్మీ, ఏవో సరిత, ఆర్‌ఐ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య జటిలం

- మిర్యాలగూడ వాణిజ్య వీధిలో విపరీతమైన రద్దీ
- హద్దుదాటి రావద్దని మునిసిపల్, పోలీస్‌శాఖ ఆదేశాలు

8



తోపుడుబండ్ల వ్యాపారుల ఆందోళన

కేంద్రంపై ఒవైసీ అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ఒవైసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కేంద్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. వ్యాఖ్యలకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో ఓవైసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నేతలు, హిందూ సంఘాల మనోభావాలు దెబ్బతినేలా ఓవైసీ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. పేద ముస్లింలకు ప్రయోజనకరంగా ఉండేందుకే వక్ఫ్‌బోర్డును కేంద్ర ప్రభుత్వం సవరణ చేస్తుందన్నారు. కొందరు ముస్లిం నాయకులు ఈ విషయాన్ని ప్రజలకు చేరనీయకుండా అపోహలు సృష్టించడం సరికాదన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు వారి స్వార్థం కోసం ముస్లింల సమాజాన్ని తమ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై కలెక్టర్లు నిర్ణయం తీసుకునే విధంగా సవరణలు ఉన్నాయన్నారు. దీంతో పేద ముస్లింలకు సమన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఓవైసీ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి 15గంటల పాటు నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు పోలీసులు తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ పోలీసులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గతంలో జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ దిష్టిబొమ్మ లను దహనం చేస్తే పోలీసులు కనీసం కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. కోమటిరెడ్డి అనుచరులు భూములను ఆక్రమించుకొని వెంచర్లు చేసిన విషయమై విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ పిల్లి రామరాజుయాదవ్, ఫకీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ము త్యాలరావు, మండల వెంకన్న, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, దిండు భాస్కర్‌గౌడ్, గుల్లపల్లి శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

నంబాల కేశవరావుది బూటకపు ఎన్‌కౌంటర్



నల్లబ్యానర్‌తో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను ఒడిషాలో అరెస్ట్ చేసి తీసుకొచ్చి చంపారని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా బాధ్యుడు సీహెచ్ సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ ఆరోపించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్‌లో గురువారం నల్లబ్యానర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపిన 28 మందిలో ఆదివాసీ ప్రజలు, మావోయిస్టు పార్టీ సభ్యులు, నాయకులు ఉన్నారన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం అబూజ్‌మడ్ అడవుల్లో ఇప్పటికే ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను, మావోయిస్టు సానుభూతిపరులను అత్యంత క్రూరంగా చంపుతున్నారని ఆరోపించారు.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కేశవరావును నిరాయుధుడిగా పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని కట్టుకథలు అల్లుతున్నారన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల బాధ్యులు గూడూరు జానకిరామ్‌రెడ్డి, కోమటిరెడ్డి అనంతరెడ్డి, గద్దపాటి సురేందర్, గోలి సైదులు అయితగోని జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిరిమాను ఉత్సవం



అడవిదేవులపల్లి మండల కేంద్రంలో శ్రీమహిషాసురమర్దిని అమ్మవారి జాతర సందర్భంగా సిరిమానును ఊరేగిస్తున్న భక్తులు

8

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : డీపీవో

పెద్దవూర, మే 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆఫీస్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వర్షాకాలం ప్రారంభం కానున్న దృష్ట్యా రోగాలు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో మురుగుకాల్వలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధీర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ :
మిర్యాలగూడ: శ్రీనివాస : సింగిల్
వెంకటేశ్వర : మిషన్ ఇంపాసిబుల్
రాఘవ : హిట్ 3
విట్రోస్ : హిట్3, ఫైనల్ డిస్టినేషన్, బ్లడ్‌లైన్స్, ఎలెవన్
దేవరకొండ : మనోజ్ : మిషన్‌ఇంపాసిబుల్, ఫైనల్ రాకింగ్
మైత్రి వెంకటేశ్వర : యమదొంగ , ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్

ట్రాఫిక్ సమస్య జటిలం

- మిర్యాలగూడ వాణిజ్య వీధిలో విపరీతమైన రద్దీ
- హద్దుదాటి రావద్దని మునిసిపల్, పోలీస్‌శాఖ ఆదేశాలు
- తోపుడుబండ్ల వ్యాపారులు ఆందోళన

మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు జటిలంగా మారుతోంది. ప్రముఖ వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా కొనసాగుతున్న పట్టణంలో వా హనాల, ప్రయాణికుల రద్దీ పెరిగి పార్కింగ్ సమస్యతో పాటు తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.
(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)


డాక్టర్స్ కాలనీలో రెండువైపులా వాహనాల పార్కింగ్(ఫైల్)

పట్టణంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి మునిసిపల్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టింది. పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలిగా ఉన్న సాగర్‌రోడ్డులో రోడ్డుపైన, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ఇతర రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడుబండ్లను మరో చోటికి తరలించడం వల్ల వాహనాల పార్కింగ్, రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడవచ్చునన్న నిర్ణ యం మేరకు రోడ్లవెంట ఉండే తోపుడు బండ్ల వ్యాపారులను రెండు రోజులుగా ఇతర చోట్లకు తరలిస్తున్నారు.

రోడ్లపైకి రావద్దు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలోని సాగర్ రోడ్డు ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు నిర్మించిన డ్రైనేజీపై పాదచారులు నడిచేందుకు వీలుగా రెండు అడుగుల స్థలాన్ని విడిచి తోపుడుబండ్ల వారు వ్యాపారం చేసుకోవాలని డ్రైనేజీ దిగితే బండిని మునిసిపాలిటీ వాహనాలతో మరో చోటికి తరలిస్తామని వారం రోజుల నుంచి ట్రాఫిక్ పోలీస్‌లు, మునిసిపల్ అధికారులు వీధి వ్యాపారులకు సూచిస్తూ వస్తున్నారు. ఫ్లైఓవర్ నుంచి బస్టాండ్ వరకు ఒకవైపున తోపుడు బండ్లను డ్రైనేజీ పైకి పెట్టిస్తూ వచ్చారు. కాగా కొందరు కీలకమైన ప్రభుత్వ స్థలాలు, అడ్డాల్లో బండ్లు ఏర్పాటు చేసుకోవడానికి అండగా ఉంటూ వారి వద్దనుంచి నెలవారి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు అధికారులు ఆరా తీస్తున్నారు. వారే ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నట్లు కూడా గుర్తించినట్లు సమాచారం.అక్రమ దందాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగించి ట్రాఫిక్‌కు అవాంతరా లు లేకుండా చేసేందుకు పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

వెంటాడుతున్న పార్కింగ్ సమస్య

పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సెట్‌బ్యాక్ లేకుండా ఇళ్లు, దుకాణ సముదాయాలు నిర్మించడంతో ఇరుకైన వీధులకు తోడు రోడ్లపైనే వాహనాలను నిలిపి ఉంచడంతో ఫోర్, టూవీలర్ల వాహనాల రాకపోకలకు వీలు కాక రోడ్లు బ్లాక్ అవుతున్నాయి. బ్యాంకులు, ఆసుపత్రులు, హోటల్స్, మద్యం దుకాణాల ముందు వాహనాలను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపివుంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సాగర్ రోడ్డుతో పాటు డాక్టర్స్ కాలనీలో వాహనాల పార్కింగ్‌తో ఆటోలు కూడా ప్రయాణించే మార్గంలేక చికిత్స కోసం ఆస్పత్రి వరకు నడవలేని రోగులు అవస్థలు పడుతున్నారు. సాగర్, చర్చిరోడ్డు, గాంధీ బొమ్మ ఎదురుగా రెడ్డికాలనీకి వెళ్లే రోడ్డు, గణేష్ మార్కెట్, కోదాడ రోడ్డులో రాజీవ్‌చౌక్ నుంచి పోస్టాఫీస్ వరకు. స్వాగత్ హోటల్ రోడ్డులు పిల్లలు స్కూల్స్‌కి వెళ్లి వచ్చే సమయాల్లో మరింత రద్దీగా మారుతున్నాయి. కొన్ని రోజులపాటు రాఘవ థియేటర్ నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే దారిని బారికేడ్లతో మూసివేసి వన్‌వే గా మార్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో వన్‌వేను ఎత్తివేశారు. టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వం, రాజకీయ అండదండలతో పార్కింగ్ కోసం సెల్లార్లు ఏర్పాటు లేకుండానే బహుళ అంతస్థుల భవనాలు నిర్మించడం వల్ల జనాభా పెరుగుతున్న కొద్దీ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ వస్తున్నాయనేది స్థానికుల అభిప్రాయం. అవసరమైతే అనుమతులు లేకుండా పిల్లర్లతో నిర్మించిన అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్ గోడలను కూల్చి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకునేటట్లు చూ డాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

● ఒక్క రోడ్డుపైనే ఐదు ట్రాఫిక్ డ్యూటీ పాయింట్లు

సాగర్‌రోడ్డుపై రద్దీ ఎక్కువగా ఉండటంతో నియంత్రణకు ట్రాఫిక్ డ్యూటీ పాయింట్లు ఏర్పాటు చేశారు. రాజీవ్ చౌక్, గణేష్ టెంపుల్, బస్టాండ్ ఇన్, అవుట్, ఇందిరాగాంధీ విగ్రహం, ఫ్లైఓవర్ ఐదు చోట్ల పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ సిబ్బంది కొరతతో రెగ్యులర్‌గా పీసీలు డ్యూటీ చేయడానికి వీలుకాకుండా పోతోందని అంటున్నారు.

పేదలను ఇబ్బంది పెట్టే ఆలోచనలేదు

పేదల పొట్టకొట్టే ఆలోచన లేదు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా అందరూ ఒకే చోట ఉండి వ్యాపారం చేసుకునేలా ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేస్తాం అంటే వద్దని అంటున్నారు. రోడ్లు రద్దీగా ఉంటే అత్యవసర సమయాల్లో అనుకున్న చోటికి వెళ్లడానికి మనమే ఇబ్బంది పడాల్సి వస్తుంది. నెగిటివ్‌గా తీసుకోకూడదు. సమాజపరంగా ఆలోచించాలి. అన్ని వర్గాల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి. -
-మహ్మద్ యూసుఫ్, కమిషనర్

తోపుడుబండ్ల వ్యాపారుల ఆందోళన

మిర్యాలగూడ : కొన్నేళ్లుగా రోడ్డు పక్కన తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, మా బండ్లు తొలగించి మమ్ముల్ని రోడ్లపాలు చేయవదంటూ పండ్ల వ్యాపారులు ఆందోళనకు దిగారు. గురువారం కూరగాయల మార్కెట్ సమీపంలో రత్తయ్య లాడ్జి ఎదురుగా రోడ్డుకు రెండువైపులా బైఠాయించి ఉదయం 11.30 నుంచి 12.30 గంటల ఆందోళన కొనసాగించారు. రోడ్డుపై పండ్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పండ్ల వ్యాపారులు అస్గర్, అజయ్, వేణు మాట్లాడుతూ రోడ్డు పక్కన నిర్మించి మోరీ దిగి రోడ్డుమీదకు బండ్లు తేవద్దని పోలీసులు, దుకాణాల ముందు బండ్లు పెట్టవద్దని యజమానులు నెట్టివేస్తున్నారని పేర్కొన్నారు రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డు పక్కనే అమ్ముకోవచ్చునని హామీ ఇచ్చి ఇప్పుడు వెళ్లగొడితే మేం ఎక్కడకు పోవాలని ప్రశ్నించారు. మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలమని భీష్మించారు. కమిషనర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవడానికి మరో 2,3 రోజులు సమయం ఇస్తారని చెప్పడంతో ఆందో ళన విరమించారు. వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు సోమ నర్సయ్య, మోతిలాల్, పీఎస్‌డీ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనాలు, అంబులెన్స్‌ను సైతం దారిమళ్లించారు. ఆందోళనలో వ్యాపారులు జాని, పర్వేజ్, షకీరా, ఇందిరా, లింగరాజు, ఫహీం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై పండ్లు పారబోసి ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు

ఘనంగా సిరిమాను ఉత్సవం


సిరిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అడవిదేవులపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువైన మహిషాసురమర్ధిని అమ్మవారి జాతరను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా గురువారం సిరిమాను ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు

మహిషాసురమర్ధిని అమ్మవారి సిరిమాను ఉత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతరలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మిర్యాలగూడ మునిసిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ కంచుకొమ్ముల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల నాయకులు బండి నాగేశ్వర్‌రావు, పసుపులేటి అజయ్, అన్నెబోయిన మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


మొక్కలతోనే మానవ మనుగడ



సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. పట్టణంలోని చైతన్యనగర్‌లో ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమృత్ -2 పథకంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టిందన్నారు. చెరువు కింద ఉన్న సభ్యులకు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. పెరుగుతున్న భూ తాపాన్ని ఆపేందుకు మొక్కలు విరివిగా నాటాలని, నేటి మొక్కలే రేపటి వృక్షాలుగా మారుతాయన్నారు. మహిళలందరూ తమ తల్లి పేరున మొక్క నాటేలా కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, వెంకన్న, శివాజీ, చంద్రకళ, పార్వపాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి


చెక్కును అందిస్తున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి

పెద్దవూర, మే 22(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. మండలంలోని నాయనవానికుంట జైరాంతండాకు చెందిన పలువురికి సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును గురువారం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నార. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పబ్బు యాదగిరి, నాయకులు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే బాలునాయక్ ● అంబ భవాని లిఫ్ట్ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష ● పలు మండలాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


నేరేడుగొమ్ము పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి లిఫ్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలం పెద్దమునిగల్‌లో చేపట్టిన అంబ భవాని ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులను నీటిపారుదలశాఖ ఎస్ఈ బద్రునాయక్, ఆర్డీవో రమణారెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. 565 కోట్ల అంచనా వ్యయంతో కంబాలపల్లి, పొగిళ్ల, అంబ భవాని, ఏకేబీఆర్, పెద్దగట్టు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించినట్లు తెలపారు. నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా కొనసాగించాలన్నారు. గుట్టలపైఉన్న గ్రామాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో అటవీశాఖ అనుమతులు వస్తాయని, పనులలో జాప్యం చేయకుండా వేగవంతంగా కొనసాగించాలన్నారు.

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్అలాగే దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగసంఘం భవనంలో అదనపు గదుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించి మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయిని మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ, అంకం చంద్రమౌళి, పంగునూరి లింగయ్య, శాంతకుమారి తపాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన

దేవరకొండ : నేరేడుగొమ్ము మండల కేంద్రంలో రూ. 1.43 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనానికి ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని తిమ్మాపురం, కొత్తపల్లి, పెద్దమునిగల్ గ్రామాలలో రూ.97లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు, ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నేరేడుగొమ్ము మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలానికి నూతనంగా రూ.1.43 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని, భవనాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునమాధవరెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, పీఆర్‌డీఈ లింగారెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, ఏర్పుల గోవిందు, సర్వయ్య యాదవ్, శ్రీశైలం, వెంకటయ్య, హరికృష్ణ, కొండల్‌రెడ్డి, బస్వరెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి :మండలంలోని పెద్దగుమ్మడంలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన రోడ్డుసదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి



మిర్యాలగూడలో ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్పీ సుదర్శన్

మిర్యాలగూడ టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో నైపుణ్యాలను పెంచేలా బోధన సాగాలని డీఆర్పీ నూనె సుదర్శన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులందరూ ఇంగ్లిష్ మీడియంపై ఆసక్తి చూ*ఎస్తున్నారని, వారి ఆసక్తికి తగినట్లుగా విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తరగతులు నిర్వహిస్తోందన్నారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవన పాఠాలు నేర్పించాలని, భవిష్యత్ అవసరాలను ఎదుర్కొనేలా ఇంగ్లీష్‌ను నేర్పించాలన్నారు. పాధ్యాయులు ఆంగ్లంపై పట్టు సాధిస్తే విద్యార్థులకు సులభతరంగా నేర్పించగలరని, అం దుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ఆయనవెంట ఆర్పీలు గులాం మహ్మద్, సైది రెడ్డి, మక్బూల్, తులసీరామ్, శ్రీనివాసరెడ్డి, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్) : వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు వృత్యంతర శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈవో కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆర్పీల చేత వివిధ అంశాలపై సబ్జెక్టుల వారీగా ఐదు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో 90 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొని వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే విధంగా తర్ఫీదు పొందుతున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


హాలియాలో..

హాలియా / నిడమనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): హాలియా, నిడమనూరు మండల కేంద్రాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. నిడమనూరులో మేరెడ్డి అజిత్‌రెడ్డి, మేరెడ్డి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజతో వివిధ కార్యక్రమాలను ప్రారంభించి పుణ్యావాహచనం, నవగ్రహ ఆరాధన, హోమం, హనుమాన్ గాయత్రీ హవనం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జైశ్రీరాం నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేరెడ్డి వెంకట్‌రాహుల్, చినవీరయ్య, వింజమూరి ప్రభాకర్, ఎం.వెంకటయ్య, కోమటి వెంకన్న, పురుషోత్తంరెడ్డి, చాపల యాదగిరి రెడ్డి, పోలెపల్లి యాదగిరి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పనుల్లో పురోగతి సాధించాలి

- మునిసిపల్ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్


సమీక్ష నిర్వహిస్తున్న మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో పురోగతి సాధి ంచాలని అదనపు కలెక్టర్, మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్ నిధులతో పబ్లిక్ హెల్త్ శాఖ చేపట్టిన పనులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ నూతన ప్రాజెక్టు, నక్షా, తదితర పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. పురపాలికలోని విభాగాల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఇంజనీర్ వెంకన్న, అంజయ్య, చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

రైతుభరోసాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

డిండి, మే 22(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రైతు భరోసా ఎన్ని ఎకరాల వరకు ఇస్తారనేదానిపై స్పష్టత ఇవ్వాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖైరొద్దిన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుభరోసా ఎన్ని ఎకరాలకు పరిమితం చేస్తారనేదానిపై నిర్దిష్టమైన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడంతో రైతులలో అయోమయం నెలకొందని అన్నారు.

గురుకులాలు ఎత్తివేసే నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

దామరచర్ల, మే22(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేయాలనే నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలలు రూ. లక్షల ఫీజును వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో పేద విద్యార్థులకు గురుకులంలో ఇంటర్మీడియట్ విద్య ఉచితంగా అందుతుందని, ఇప్పుడు వాటిని ప్రభుత్వం ఎత్తివేయడం వల్ల పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడమేనన్నారు.